శుక్రవారం
FRIDAY
30-10-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు:12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 2 Volume:2 | సంచిక: 121 Issue: 121

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com



చాట్‌జీపీటీ వైద్యం.. ప్రాణం తీసింది!



ఓపెన్‌ఏఐపై యువతి తల్లిదండ్రుల దావా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాట్‌బాట్ అయిన చాట్‌జీపీటీ ఇచ్చిన వైద్య సలహా పాటించడం వల్లే తమ కుమార్తె మరణించిందని ఆరోపిస్తూ ఓ జంట టెక్ దిగ్గజం ఓపెన్‌ఏఐపై దావా వేసింది.

సియాటెల్: ఈ విషాద ఘటన అమెరికాలోని సియాటెల్‌లో చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రులు దాఖలు చేసిన ఈ కేసు, వైద్యపరమైన విషయాల్లో ఏఐపై ఆధారపడటంలోని ప్రమాదాలపై తీవ్ర చర్చను రేకెత్తిస్తోంది. సియాటెల్‌కు చెందిన బోవెన్ వాన్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చాలాకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె తన అనారోగ్య నియంత్రణకు లామోట్రిజిన్ అనే మందును వాడుతున్నారు. అయితే, ఈ మందుల సైడ్ ఎఫెక్ట్స్ తన ఆలోచనా శక్తి,

తరువాయి 2 వ పేజీలో...

సైబర్ దాడి చేసిన చైనా ఏఐ

ప్రముఖ చైనా ఏఐ సంస్థకు చెందిన ఫ్లాగ్‌షిప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్.. నియంత్రిత పరీక్షా సిమ్యులేషన్లలో అత్యంత సంక్లిష్టమైన సైబర్ దాడిని విజయవంతంగా నిర్వహించినట్లు పరిశోధకులు వెల్లడించారు.

బీజింగ్: ఈ ప్రయోగాల సమయంలో ఆ మోడల్ పదేపదే భద్రతా నిబంధనలను, ఆదేశాలను బేఖాతరు చేసినట్లు తేలింది. ఇది భవిష్యత్తులో డిజిటల్ భద్రతకు పెనుముప్పుగా పరిణమించే అవకాశం ఉందన్న ఆందోళనలను వ్యక్తం చేస్తోంది. టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలు జరుగుతున్నప్పటికీ వాటివల్ల కలిగే దుష్పరిణామాలపై నిపుణులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతారు. ఇందులో భాగంగానే చేపట్టిన కంట్రోల్డ్ టెస్టింగ్ (నియంత్రిత పరీక్షలు) సమయంలో చైనాకు చెందిన జెడ్.ఏఐ సంస్థకు చెందిన ఏఐ మోడల్ ప్రవర్తన పరిశోధకులను విస్మయానికి గురిచేసింది. మనుషుల ప్రమేయం లేకుండానే స్వయంగా నిర్ణయాలు తీసుకోగల ఈ మోడల్ డిజిటల్ నెట్‌వర్క్‌లలోని లోపాలను ఆసరాగా చేసుకొని కాంప్లెక్స్ సైబర్ దాడికి పాల్పడింది.

తరువాయి 2 వ పేజీలో...



మల్లన్న సాగర్ వద్ద ఇల్లీగల్ బ్లాస్టింగ్స్!

రిజర్వాయర్‌కు అతి సమీపంలో చర్యలు

నిబంధనలకు విరుద్ధం.. హరీశ్ రావు ఫైర్



సిద్దిపేట, అక్టోబర్ 29 (ఈవార్తలు): తెలంగాణ సాగునీటి రంగంలో కీలకమైన మల్లన్న సాగర్ రిజర్వాయర్ భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రమాదంలోకి నెడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కట్టకు అతి సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా, రాత్రిళ్లలో చేపడుతున్న భారీ బ్లాస్టింగ్‌లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి గురువారం ఆయన బహిరంగ లేఖ రాశారు. అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్‌లు చేస్తున్న కాంట్రాక్ట్ ఏజెన్సీ నిర్వాహకులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి వెంటనే

తరువాయి 3 వ పేజీలో...

పాడైనెక్కిన పంటలు!

ఎండిన 23.40 లక్షల ఎకరాల సాగు.. ఎల్‌నినో ప్రభావంతో కోలుకోలేని దెబ్బ

పత్తి, వరి రైతులకు తీవ్రస్థాయిలో నష్టం

నల్లగొండ, నారాయణపేట జిల్లాల్లో భారీ ప్రభావం

నష్టపరిహారం అందించాలని రైతు సంఘాల డిమాండ్

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం అన్నదాతలపై కోలుకోలేని దెబ్బతీసింది. వర్షాభావ పరిస్థితులు, తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. తెలంగాణ వ్యవసాయ శాఖ తాజాగా విడుదల చేసిన ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో ఏకంగా 23,40,000 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారికంగా వెల్లడైంది.

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా కోట్లాది రూపాయల పెట్టుబడి నష్టపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎల్ నినో తీవ్రత కారణంగా రాష్ట్రంలోని అన్ని ప్రధాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అత్యధికంగా పత్తి పంట ఏకంగా 15 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. ఆ తర్వాత వరి పంట 4 లక్షల ఎకరాల్లో, కందులు 1,50,000 ఎకరాల్లో, మక్కలు 70 వేల ఎకరాల్లో, మిరప పంట సుమారు 14 వేల ఎకరాల్లో పూర్తిగా దెబ్బతిన్నాయి. పెట్టుబడి పెట్టి

తరువాయి 2 వ పేజీలో...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మహ్మద్ నగర్ గ్రామంలో ఎండిన పంట పొలంలో బిగాలుగా కూర్చున్న రైతు

జిల్లాల వారీగా నష్టం (టాప్ 5)

నల్లగొండ:	నారాయణపేట:	సంగారెడ్డి:	జనగామ:	నాగర్‌కర్నూల్:
3,58,000 ఎకరాలు	2,40,000 ఎకరాలు	2,19,000 ఎకరాలు	2,00,000 ఎకరాలు	1,78,000 ఎకరాలు

కేటీఆర్.. నేను చింతిస్తున్నా!

కొండా సురేఖ ట్వీట్



హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): గతంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానంటూ మాజీ మంత్రి కొండా సురేఖ ట్వీట్ చేశారు. 'ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో అలా మాట్లాడా.. ఆనాడు నేను అలా మాట్లాడకుండా ఉండాల్సింది. కేటీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించాలన్న దురుద్దేశం లేదు. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా' అంటూ కొండా సురేఖ ఎక్స్ వేదికగా తెలిపారు. 'కేటీఆర్‌పై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ

తరువాయి 3 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,395
వెండి (కిలో):	రూ.2,15,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,631

మియాపూర్ భూములు

సర్కారువే

550 ఎకరాలపై సుప్రీం కీలక తీర్పు

భూముల పరిరక్షణపై కోర్టు అభినందన

26 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అత్యంత విలువైన భూములకు సంబంధించిన కీలక వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న సుమారు 550 ఎకరాల భూమికి సంబంధించి ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది.

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): దీంతో ఈ భూములపై కొనసాగుతున్న న్యాయపోరాటంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీ శుభవార్త లభించింది. వేల కోట్ల రూపాయల విలువైన భూముల పరిరక్షణకు సంబంధించిన ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. మియాపూర్‌లోని ఈ భూములకు సంబంధించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తూ శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన కేసులో 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. అయితే హైకోర్టు

తరువాయి 2 వ పేజీలో...



బ్యాంకులదే తప్పు

సైబర్ మోసాలు జరుగుతుంటే ఏం చేస్తున్నాయ్?

పెద్దమొత్తంలో డ్రా అవుతుంటే స్పందించవెందుకు?

బాధితులకు బ్యాంకులే రక్షణ కవచం కావాలి

కచ్చితంగా పరిహారం చెల్లించి తీరాల్సిందే

డిజిటల్ అరెస్ట్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

దేశవ్యాప్తంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, కోట్లాది రూపాయలను కాజేస్తున్న 'డిజిటల్ అరెస్టు' మోసాలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రచారాలు, వార్తాపత్రికలు, దృశ్య మాధ్యమాల ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నప్పటికీ, ఉన్నత విద్యావంతులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఆర్థికంగా స్థిరపడిన వ్యక్తులు సైతం ఈ మోసగాళ్ల వలలో ఎలా చిక్కుకుంటున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది.

న్యూఢిల్లీ: ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తి తనను పోలీసు అధికారిగా, దర్యాప్తు సంస్థ ప్రతినిధిగా లేదా న్యాయస్థాన అధికారిగా పరిచయం చేసుకుని అరెస్టు చేస్తామని బెదిరిస్తే, అంతగా భయపడి లక్షలాది, కోట్లాది రూపాయలను ఎందుకు బదిలీ చేస్తున్నారని ప్రశ్నించింది. డిజిటల్ అరెస్టు మోసాలపై సుమోటోగా విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించింది. జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం బాధితులు మోసపోతున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తడంతోపాటు, ఇటువంటి నేరాలను

తరువాయి 2 వ పేజీలో...

విశ్వేవాణి



మద్యం సేవనాన్ని తగ్గించేందుకు ఏ విధమైన సూచనలు ప్రభావవంతంగా ఉంటాయో తెలుసుకునేందుకు దాదాపు 8 వేల మందితో నిర్వహించిన అధ్యయనంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. మద్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించడంతోపాటు, తాము తాగే ప్రతి గ్లాసునూ లెక్కపెట్టాలని సూచించిన విధానం మెరుగైన ఫలితాన్ని ఇచ్చింది. ముఖ్యంగా మద్యం వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని తెలియజేస్తూ, తాగిన మోతాదును నమోదు చేసుకోవాలని చెప్పినప్పుడు సేవనం గణనీయంగా తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు.

టామ్‌కామ్.. స్కాం

జాబ్ క్యాలెండర్ ఇస్తామని.. స్కాం క్యాలెండర్ ఇచ్చారు

కార్మిక, శక్తి శాఖ ఆధ్వర్యంలో వందలాది మందిని మోసం చేశారు

మంత్రి వివేక్ పై క్రిమినల్ కేసు, చీటింగ్ కేసులు పెట్టాలి

బాధితులందరికీ కట్టిన ఫీజు తిరిగి చెల్లించాలి

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఎన్నికల ముందు జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఇపుడు నెలకో స్కాం క్యాలెండర్ చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెర తీసిన మరో స్కాం టామ్ కామ్ స్కాం అన్నారు. కార్మిక, శక్తి శాఖ ఆధ్వర్యంలో వందలాది మందిని మోసం చేశారని.. స్కాంలకు కాంగ్రెస్ చిరునామాగా మారిందన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'జనవరిలో సివిల్ సప్లయ్స్ స్కాం, ఫిబ్రవరిలో ఫ్లై యాష్ స్కాం, మార్చిలో ఇసుక స్కాం, ఏప్రిల్‌లో ఆర్టీసీ కాంట్రాక్ట్, మే లో అమృత్ టెండర్, జూన్ లో ఫోర్త్ సిటీ, జూలైలో లగచర్ల, కంచ గచ్చిబౌళి భూములు, ఆగస్టులో పీజీ

తరువాయి 2 వ పేజీలో...



సర్ గడువు మళ్లీ పొడిగింపు

ఏపీలో 20, టీజీలో 26 వరకు

సవరణ షెడ్యూల్‌పై ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు సంబంధించి సవరించిన నూతన షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఓటర్ల నమోదు, వివరాల సవరణ, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణను సమర్థవంతంగా పూర్తి

తరువాయి 2 వ పేజీలో...

పెట్టుబడులకు నేను సంరక్షకుడిని

పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ భరోసా

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్న దేశ, విదేశీ పారిశ్రామిక దిగ్గజాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప భరోసా కల్పించారు. 'తెలంగాణలో ఎంత పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారో మీ మనసులో ఒక సంఖ్యను అనుకోండి.. దాన్ని వెంటనే రెట్టింపు చేయండి! మీ లాభాలనూ, వృద్ధి అంచనాలనూ రెట్టింపు చేసుకోండి.



హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): మీ పెట్టుబడులకు సెక్యూరిటీ కల్పించి, అవి వేగంగా వృద్ధి చెందేలా చూసే బాధ్యత నాది.. మీ పెట్టుబడులకు నేను సంరక్షకుడిగా ఉంటా' అని హామీ ఇచ్చారు.. ఢిల్లీ వేదికగా గురువారం జరిగిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కర్టెన్ రైజర్ ఈవెంట్‌లో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో

తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలితాలు

30-10-2026

మేషం: ఉద్యోగస్తులకు అధికారుల సహాయంతో పదోన్నతులు పెరుగుతాయి. ఆప్తుల నుండి అరుదైన శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. కొన్ని పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

వృషభం: చిన్ననాటి మిత్రులతో వివాదాలు తప్పవు. ఉద్యోగస్తులకు పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. దైవానుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేయగలుగుతారు. ఇంటా బయట సమస్యలు ఉన్నప్పటికీ అధిగమించి ముందుకు సాగుతారు.

మిథునం: ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. ఉద్యోగస్తులకు అధికారుల నుండి విమర్శలు తప్పవు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. కొన్ని వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు.

కర్కాటకం: జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు.

సింహం: మిత్రుల నుండి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. స్నేహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాల విస్తరణకు భాగస్తులు నుండి సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

కన్య: దూర ప్రయాణాలు వీలైనంత వరకు వాయిదా వేయడం మంచిది. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఋణదాతల ఒత్తిడి అధికమవుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. కీలక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా చికాకు పరుస్తుంది.

తుల: వ్యాపార ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. చిన్ననాటి మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించడం మంచిది. ధన వ్యవహారాలలో కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి.

వృశ్చికం: ఉద్యోగస్తులకు మరింత అనుకూల పరిస్థితులు ఉంటాయి. శుభకార్యాలకు ధనవ్యయం చేస్తారు. వ్యాపారాలు లాభాల బాట పడుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. వివాదాలకు సంబంధించి ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

ధనస్సు: అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉండదు. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి.

మకరం: గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున పరిస్థితులు అనుకూలిస్తాయి. ఆస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలిస్తాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

కుంభం: వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో కలహ సూచనలున్నవి. వృథా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ముఖ్యమైన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

మీనం: విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. చిన్ననాటి మిత్రుల నుంచి ధన సహాయం అందుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా ఉంటాయి. బంధువుల కలయిక ఉత్సాహాన్నిస్తుంది.

పెట్టుబడులకు నేను సంరక్షకుడిని

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని సరికొత్త 'భారత్ ఫ్యూచర్ సిటీ' వేదికగా జరగనున్న మెగా ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలను సాదరంగా ఆహ్వానించారు. హైదరాబాద్‌కు 400 ఏళ్ల ఘనమైన వాణిజ్య చరిత్ర ఉందని సీఎం గుర్తుచేశారు. ఆనాటి చార్మినార్ వీధుల్లో ముత్యాలు, సుగంధ ద్రవ్యాల వ్యాపారం నుంచి నేటి గ్లోబల్ లీడర్ల వరకు భాగ్యనగరం ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా, అడోబ్ సీఈవో శంతను నారాయణ్ వంటి గ్లోబల్ లీడర్లను అందించిన ఘనత హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌దేనని కొనియాడారు. దేశ ఆర్థిక పురోగతికి బాటలు వేసిన దివంగత ప్రధానులు రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావుల సేవలను స్మరించుకుంటూ.. దేశ సంస్కరణలకు ప్రతిరూపంగా నిలిచిన తెలంగాణ గడ్డ ఎప్పుడూ పెట్టుబడులకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. రాజకీయ సిద్ధాంతాలు వేరైనా గత 30 ఏళ్లుగా హైదరాబాద్ అభివృద్ధికి పాలకులు అందించిన నిరంతర మద్దతును ఆయన శ్లాఘించారు. హైదరాబాద్ లక్ష్యం చిన్నది కాదని సీఎం తేల్చిచెప్పారు. "హైదరాబాద్ దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలతో పోటీ పడటం లేదు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలతోనే మన పోటీ" అని కుండబద్దలు కొట్టారు. వ్యాపారవేత్తల ఎదుగుదలలో ప్రభుత్వం ఒక అడ్డంకిలా ఉండకూడదని, అనవసర జోక్యాలను తగ్గించి రెడ్ కార్పెట్ పరిచి అవకాశాలను విస్తరించడమే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. 'వికసిత్ భారత్ 2047'లో తెలంగాణ కీలక పాత్ర పోషించనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. "2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారితే, అందులో తెలంగాణ వాటా కనీసం 10 శాతం (3 ట్రిలియన్ డాలర్లు) ఉండేలా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేశాం. మధ్యంతరంగా 2034 నాటికే 1 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకుంటాం" అని వివరించారు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెట్టుబడిదారులకున్న అనుమానాలను నివృత్తి చేస్తూ.. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని వెల్లడించారు. దేశంలో తలపెట్టిన 7 హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్లలో 3 కారిడార్లు (హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–పుణె) మన నగరానికే దక్కాయని, వీటికితోడు వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తోందని సీఎం స్పష్టం చేశారు.



టామ్‌కామ్.. స్కాం

మొదటి పేజీ తరువాయి

మెడికల్, సెప్టెంబర్ లో హిల్ట్, అక్టోబర్‌లో పవర్, నవంబర్‌లో సింగరేణి, డిసెంబర్‌లో కేఎల్ఎస్ఆర్ స్కాంలకు తెర తీశారు. కాంగ్రెస్ పాలనలో వారానికో స్కాం జరుగుతోంది. తెలంగాణ రైజింగ్ కాదిది.. సింకింగ్. టామ్ కామ్ గురించి రోజు టామ్ టామ్ చేస్తూ జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ కూడా ప్రభుత్వ ఖర్చులు వైట్ పాస్ పోర్ట్ తో వెళ్లి వచ్చారు. తెలంగాణలో 40 లక్షల మంది నిరుద్యోగులున్నారు. రిజిస్టర్ కాని వాళ్లు ఇంకో 5, 10 లక్షల మంది ఉంటారు. ఏ ప్రభుత్వం కూడా వంద శాతం ఉద్యోగాలు కల్పించదు. అందుకే ఇతర దేశాలకు పంపి ఉద్యోగాలిచ్చేందుకు టామ్ కామ్ 2014 లో ఆనాడు కేసీఆర్ ప్రారంభించారు. బ్రోకర్ల ద్వారా మోసాలు, పాస్ పోర్ట్ సీజ్ చేయడం, ఒక జాబ్ అని చెప్పి ఇంకో జాబ్, వర్కింగ్ వీసా అని చేప్పి విజిటింగ్ వీసా ఇస్తూ మోసం జరిగేది. దాని నుండి రక్షణ కల్పించి ప్రభుత్వమే విదేశాలకు పంపాలని ఉద్దేశ్యంతో ఏర్పాటైంది టామ్ కామ్. కానీ ఇపుడు కాంగ్రెస్ పాలనలో టామ్ కామ్ టామ్ స్కాంగా అయిపోయింది. జర్మనీలో టెక్నికల్ ఉద్యోగాలు, వేర్ హౌస్ ఉద్యోగాలు, నర్సింగ్ ఉద్యోగాలు, ఆస్ బిల్డింగ్, మెకాట్రానిక్స్, డ్రైవింగ్ వంటి ఉద్యోగాల కోసం ప్రభుత్వమే టామ్ కామ్ నోటిఫికేషన్, అడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చింది. ప్రభుత్వాన్ని నమ్మి వందలాది మంది ఆంధ్ర నుండి కూడా వచ్చి జాయిన్ అయ్యారు. మంత్రి వివేక్ బిజినెస్ క్లాస్‌లో జర్మనీ వెళ్లి, స్టార్ హోటల్‌లో ఉండి, కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. జపాన్ సౌత్ కొరియాలో కూడా తిరిగొచ్చి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇది కూడా ఉచితంగా కాదు, ఒక్కొక్కరు 4.1 లక్షలు కట్టాలన్నారు. హై టెక్ సిటీలో 6 నెలల పాటు, గోతే ఇనిస్టిట్యూట్ సాయంతో జర్మనీ భాష నేర్పించారు. వాస్తవంగా గోతే ఇనిస్టిట్యూట్ జర్మనీ ప్రభుత్వ సాయంతో ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో జర్మనీ భాష నేర్పిస్తుంది. అభ్యర్థులు చేరిన తర్వాత వారి చేత, క్యాండిడేట్ అగ్రిమెంట్ ఫాం మీద సంతకాలు తీసుకున్నారు. దీని మీద కోవలం ఫేర్ స్ట్రీట్ అనే కంపెనీ పేరు ఉంది. టామ్ కామ్ పేరు లేదు. ఇక్కడే మోసం జరిగింది. జర్మనీ భాషలో ఏ1, ఏ2, బీ1, బీ2 లెవల్స్ ఉంటాయి. జర్మనీ వెళ్లాలంటే బీ1 తప్పనిసరి. బీ1 లెవల్ ఎగ్జామ్ స్లాట్ బుక్ చేయడానికి మళ్లీ 20 వేలు కట్టుమన్నారు. హైదరాబాద్‌లో కాకుండా చెన్నై పంపారు. ఖర్చులన్నీ విద్యార్థులే భరించారు. వందల మంది జాయిన్ అయి బీ1 పాస్ అయిన తర్వాత 10 మందిని కూడా జర్మీనీకి పంపలేదు. ఒక వ్యక్తి నవీన్ (పేరు మార్పు) జర్మనీకి వెళ్లిన తర్వాత అతనికి టెక్నికల్ ఉద్యోగం అని చెప్పి.. బీఫ్, పోర్క్, మటన్ కట్ చేయాలని బలవంతం చేశారు. ఇది తట్టుకోలేక ఇండియా తిరిగొచ్చారు. అతన్ని పంపేటపుడు అతనికి ఇచ్చిన ఆర్డర్ కాపీలో కూడా టామ్ కామ్ పేరు లేదు. కేవలం ఫేర్ స్ట్రీట్ పేరు మాత్రమే ఉంది. సేల్స్ మెన్ ఉద్యోగం అని చెప్పి, గోదాంలో ఉద్యోగం ఇస్తున్నారు, వివేక్ వెంకటస్వామి తమ పిల్లలతో ఇలాంటి పనులు చేయిస్తరా? మోసపోయిన అభ్యర్థులు ఇండియాకు అతి కష్టం మీద తిరిగొచ్చి, మా డబ్బు మాకివ్వాలని టామ్ కామ్ ఆఫీస్‌కి వెళ్తే.. ఫేర్ స్ట్రీట్ ను అడగాలంటున్నారు. ఇపుడు పిల్లలు టామ్ కామ్ కు డబ్బులు కట్టి, ఫేర్ స్ట్రీట్ కంపెనీని వెళ్లి ఎలా వాపస్ ఇవ్వమని అడగుతరు? రేవంత్ రెడ్డి సౌత్ కొరియా వెళ్లి తన సతీమణి పేరు మీద గీతా హ్యాండాయ్ షేర్లు తెచ్చుకున్నరు. కానీ పిల్లలకు ఏం ఇవ్వడం లేదు. కార్మిక శాఖలో 150 కోట్ల ఇన్సురెన్స్ కుంభకోణం. ట్రయల్ బ్లెజర్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చి దోపిడీకి పాల్పడ్డారు. బతికున్న వారిని చనిపోయారని చెప్పి, ఫేక్ ఎఫ్ఐఆర్ లు అప్‌లోడ్ చేసి లక్షల రూపాయలు దోచుకున్నరు. ఇంత జరిగినా మంత్రి వివేక్, పోలీస్ స్టేషన్‌లో ఎందుకు కేసు పెట్టలేదు? కార్మిక శాఖ స్కాంలకు చిరునామాగా మారింది. ప్రభుత్వం మీద చీటింగ్, క్రిమినల్ బ్రీత్ ఆఫ్ ట్రస్ట్, వినియోగదారుల ఫోరంలో కేసులు పెడుతం. నిజంగా ఉద్యోగాలు ఇస్తే వారి వివరాలు బయట పెట్టాలి. ఎవరికి ఇచ్చారు, ఏం ఉద్యోగం ఇచ్చారు, ఏ దేశంలో ఇచ్చారో తెలపాలి. కొండా సురేఖ బేషరతుగా, బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. ఇది తెలంగాణ ప్రజల ఇమేజ్ ని దెబ్బతీయడం. మహిళలందరికీ అవమానకరం. 509 ఐపీసీ ప్రకారం నేరం. చింతిస్తున్నా, అలా అనకుండా ఉండాల్సింది అంటే సరిపోదు' అని ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు.

సర్ గడువు మళ్లీ పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

చేయాలనే లక్ష్యంతో ఈ గడువును ఈసీఐ పొడిగించింది. ఏపీలో నవంబర్ 20 వరకు, తెలంగాణలోనూ నవంబర్ 26 వరకు గడువు పొడిగించింది. నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా ప్రచురించనుంది. ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల విజ్ఞప్తులు, రాజకీయ పార్టీల అభ్యర్థనలను పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు అధికారికంగా కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం ప్రజలకు, కొత్త ఓటర్లకు దరఖాస్తులు సమర్పించడానికి అదనపు సమయం లభించింది. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియకు ఈసీ గడువును పొడిగించింది. గ్రామాల్లో, పట్టణాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన అర్హులైన పౌరుల వివరాలను నమోదు చేయడంతో పాటు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందిస్తారని అధికారులు వెల్లడించారు. పొడిగించిన గడువుల ప్రకారం స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన జరిపి పరిష్కరించనున్నారు. అర్హత కలిగిన ఓటర్లందరూ ఈ పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది.

మియాపూర్ భూములు సర్కారువే

మొదటి పేజీ తరువాయి

తీర్పును సవాల్ చేస్తూ ప్రైవేటు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై విచారణ జరిపిన ధర్మాసనం తాజాగా వాటిని కొట్టివేసింది. పార్థసారధి, సువిశాల్ జైన్ అనే వ్యక్తులు పూర్వపు జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధ వారసులుగా పేర్కొన్న అమీరున్నిషా నుంచి ఈ భూములను చట్టబద్ధంగా పొందినట్లు వాదించారు. తమ వద్ద ఉన్న ఇర్రివోకబుల్ జీపీఏ, సనద్ పత్రాల ఆధారంగా హక్కులను గుర్తించాలని కోర్టును కోరారు. రిజిస్టర్డ్ పత్రాలను రద్దు చేసే అధికారం శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు లేదన్నది వారి ప్రధాన వాదనగా ఉంది. మరోవైపు.. తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాదులు ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. జాగీర్దార్ కైసరుద్దీన్‌కు సంబంధిత భూముల విషయంలో అప్పట్లోనే పరిహారం చెల్లించినందున.. ఆయన వారసులుగా చెప్పుకుంటున్నవారికి ఆ భూములపై హక్కులు క్లెయిమ్ చేసే అవకాశం లేదని ప్రభుత్వ లాయర్లు వాదించారు. భూములపై ప్రభుత్వ హక్కులు, గతంలో తీసుకున్న నిర్ణయాల చట్టబద్ధతకు సంబంధించిన అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రైవేటు వ్యక్తుల అప్పీళ్లను కొట్టివేసింది. ప్రభుత్వ భూముల పరిరక్షణకు తీసుకున్న చర్యలను కూడా కోర్టు అభినందించింది. ఈ తీర్పుతో మియాపూర్‌లోని సర్వే నంబర్లు 100, 101 పరిధిలో ఉన్న సుమారు 550 ఎకరాల భూములపై వివాదంలో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 2003లో హైకోర్టు తీర్పు వెలువడినప్పటి నుంచి కొనసాగుతున్న న్యాయపోరాటంలో తాజా ఉత్తర్వులు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

బ్యాంకులదే తప్పు

మొదటి పేజీ తరువాయి

అరికట్టడంలో బ్యాంకులు నిర్వహించాల్సిన బాధ్యతను స్పష్టం చేసింది. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన వ్యక్తుల ఖాతాల నుంచి అనూహ్యంగా భారీ మొత్తాలు బదిలీ అవుతున్నప్పుడు వాటిని గుర్తించి అడ్డుకునే వ్యవస్థలు బ్యాంకుల్లో ఎందుకు సమర్థంగా పనిచేయడం లేదని నిలదీసింది. బ్యాంకుల నిర్లక్ష్యం వల్లే నష్టం జరిగిందని తేలితే, బాధితుడికి పూర్తి నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత బ్యాంకుదేనని హెచ్చరించింది. డిజిటల్ అరెస్టు అనే భావనపైనే సుప్రీంకోర్టు ప్రధానంగా ప్రశ్నలు సంధించింది. ప్రజాస్వామ్య దేశంలో చట్టబద్ధమైన అరెస్టుకు నిర్దిష్టమైన విధివిధానాలు ఉంటాయని, కేవలం మొబైల్ ఫోన్ లేదా దృశ్య ప్రసార మాధ్యమం ద్వారా ఎవరో బెదిరించినంత మాత్రాన ఒక వ్యక్తి అరెస్టయినట్లు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ఈ బాధితులకు ఏమైంది? వీళ్లు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? ఈ ప్రాథమిక విషయం కూడా వాళ్లకు అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు చేస్తారేమోనని భయమెందుకు?" అంటూ ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు పోతుంది కదా? అంటూ చేసిన వ్యాఖ్య ద్వారా ఫోన్‌లో సృష్టిస్తున్న భయానికి వాస్తవ చట్టపరమైన అధికారం లేదనే విషయాన్ని ఎత్తిచూపారు. ప్రజలు ఇలాంటి మోసాలకు ఎలా లొంగిపోతున్నారో అర్థం కావడం లేదని, ఇందులో మానసికంగా ఏమి జరుగుతోందో దేవుడికే తెలియాలని వ్యాఖ్యానించారు. వయసులో పెద్దవారు, అనుభవజ్ఞులు, సమాజంలో బాధ్యతాయుతమైన స్థానాల్లో పనిచేసినవారు సైతం ఇలాంటి మోసాలకు గురవుతున్న తీరుపై ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. "ఈ వయసులో మీరు డిజిటల్‌గా అరెస్టు అయితే, రాబోయే తరానికి ఏం పాఠాలు నేర్పుతారు?" అని ప్రశ్నించింది. నిజంగా ఏదైనా కోర్టు ఉత్తర్వు ఉందని చెబితే, సంబంధిత న్యాయస్థానం అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి వాస్తవాన్ని తెలుసుకోవచ్చని సూచించింది. ఈ విచారణ సందర్భంగా డిజిటల్ అరెస్టు మోసాల తీవ్రతను తెలియజేసే ఓ ఘటనను సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ ఎన్.ఎస్. నప్పినాయ్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. గతవారం ఓ మహిళ ఈ తరహా మోసానికి గురై రూ.2.5 కోట్లు కోల్పోయినట్లు వివరించారు. ప్రభుత్వాలు, దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టినప్పటికీ, ఇలాంటి ఘటనలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అందుకే నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడమే కాకుండా, నగదు బదిలీ జరిగే సమయంలోనే అనుమానాలను గుర్తించి అడ్డుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేశారు. ముఖ్యంగా పదవీ విరమణ చేసినవారు, జీవితకాల పొదుపును ఖాతాల్లో ఉంచుకున్న వృద్ధుల విషయంలో మరింత అప్రమత్తత అవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఖాతాదారుడి సాధారణ లావాదేవీల సరళితో పోల్చి, అసాధారణంగా కనిపించే లావాదేవీలను గుర్తించి, వాటి నిజానిజాలను నిర్ధారించుకోవడమే లక్ష్యంగా ఉండాలని సూచించింది. బ్యాంకులు ప్రజలకు రక్షణ కవచంగా నిలవాలని ధర్మాసనం పేర్కొంది. డిజిటల్ అరెస్టు లేదా ఇతర సైబర్ మోసాల్లో ఆర్థిక సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే నష్టం జరిగిందని విచారణలో తేలితే, బాధితుడికి జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది ప్రతిపాదిత నిబంధనల్లో బాధితుడికి కలిగిన నష్టానికి తగ్గకుండా పరిహారం చెల్లించేలా నిబంధనలు ఉండాలని పేర్కొంది.

చాట్‌జీపీటీ వైద్యం.. ప్రాణం తీసింది!

మొదటి పేజీ తరువాయి

మాటతీరుపై ప్రభావం చూపుతున్నాయని ఆమె ఆందోళన చెందారు. దీనికితోడు ఆమె పనిచేస్తున్న అమెజాన్ సంస్థలో ఉద్యోగం కోల్పోయే పరిస్థితి ఏర్పడటంతో మరింత ఒత్తిడికి గురయ్యారు. ఈ క్రమంలో ఆమె చాట్‌జీపీటీని ఆశ్రయించారు. తన మందుల డోసును రోజుకు 400 మిల్లీగ్రాముల నుంచి కొన్ని వారాల్లో సున్నాకు ఎలా తగ్గించుకోవాలో చాట్‌జీపీటీ ఆమెకు ఒక ప్రణాళికను సూచించిందని తల్లిదండ్రులు తమ ఫిర్యాదులో ఆరోపించారు. అంతేకాదు, ఈ విషయాన్ని వైద్యులకు చెప్పవద్దని కూడా ఆ చాట్‌బాట్ సలహా ఇచ్చిందని వారు పేర్కొన్నారు. చాట్‌జీపీటీ సలహా మేరకు మందులు తగ్గించుకున్న బోవెన్ వాన్, 2026 ఫిబ్రవరిలో మూర్ఛ వ్యాధికి సంబంధించిన సమస్యలతో (సడెన్ అన్‌ఎక్స్‌పెక్టెడ్ డెత్ ఇన్ ఎపిలెప్సీ) మరణించారు. ఆమె మరణానంతరం నిర్వహించిన పరీక్షల్లో, ఆమె శరీరంలో లామోట్రిజిన్ మందు స్థాయిలు వైద్యపరంగా అవసరమైన దానికంటే చాలా తక్కువగా ఉన్నట్లు తేలింది. ఆమెకు చికిత్స అందించిన న్యూరాలజిస్ట్ కూడా, ఆమె పరిస్థితికి మందులు ఆపేయమని తాను ఎట్టిపరిస్థితుల్లోనూ సలహా ఇచ్చేవాడిని కాదని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ఓపెన్‌ఏఐ స్పందిస్తూ, ఈ ఘటన హృదయ విదారకమని పేర్కొంది. బోవెన్ వాన్ ఉపయోగించిన చాట్‌జీపీటీ మోడల్ పాత వెర్షన్ అని, ప్రస్తుతం అందుబాటులో లేదని తెలిపింది. అత్యవసర పరిస్థితులను గుర్తించడంలో కొత్త సిస్టమ్స్ మెరుగ్గా పనిచేస్తాయని వివరణ ఇచ్చింది. అందుకే ఏఐ వాడకాన్ని కొన్నింటికే పరిమితం చేయాలని, వైద్యం వంటి సున్నిత అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సైబర్ దాడి చేసిన చైనా ఏఐ

మొదటి పేజీ తరువాయి

అత్యంత కఠినమైన భద్రతా వలయాలు, నిబంధనల మధ్య నిర్వహించిన ఈ పరీక్షల్లో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా తనంతట తానుగా వ్యవహరించడం టెక్ వర్గాల్లో కలవరం రేపుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నమూనాలు వేగంగా పరిపక్వత చెందుతుండటం, ఓపెన్–వెయిట్ ఆర్కిటెక్చర్‌ల ద్వారా వాటిని ఎవరైనా సులభంగా డౌన్‌లోడ్ చేసుకుని తమ అవసరాలకు తగ్గట్టు మార్చుకునే అవకాశం ఉండటం సైబర్ సెక్యూరిటీకి సవాల్‌గా మారుతోంది. కొన్ని సందర్భాల్లో ఈ ఏఐ టూల్స్ కోడ్ విశ్లేషణ, ఎర్రర్‌లను గుర్తించడంలో ఎంత వేగంగా పనిచేస్తున్నాయో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే విధ్వంసం సృష్టించడంలోనూ అంతే ప్రమాదకరంగా మారుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆర్బీఐ కొత్త నిబంధనలపై సుప్రీం దృష్టి

మొదటి పేజీ తరువాయి

ఈ కేసులో భారతీయ రిజర్వు బ్యాంకు ప్రతిపాదిస్తున్న 2026 నాటి ఖాతాదారుల గుర్తింపు నిబంధనల సవరణలపైనా ధర్మాసనం దృష్టి సారించింది. వాటిని అధికారికంగా ప్రకటించే ముందు పరిశీలిస్తామని తెలిపింది. ప్రతిపాదిత నియంత్రణ వ్యవస్థలో ప్రధానంగా మూడు రకాల భద్రతా చర్యలు ఉండాలని కోర్టు సూచించింది. 'ఖాతాదారుడి సాధారణ లావాదేవీలకు భిన్నంగా భారీ మొత్తం బదిలీ అవుతున్నప్పుడు, దాని నిజానిజాలు నిర్ధారించే వరకు లావాదేవీని తాత్కాలికంగా నిలిపివేసే విధానం ఉండాలి. అనుమానాస్పద లావాదేవీని గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అవసరమైన సందర్భాల్లో ఖాతాదారుడిని వ్యక్తిగతంగా సంప్రదించి లేదా ప్రత్యక్షంగా ధ్రువీకరించి, లావాదేవీ నిజంగానే అతని స్వచ్ఛంద నిర్ణయంతో జరుగుతోందో లేదో తెలుసుకోవాలి. అంతేకాకుండా, అనుమానాస్పద భారీ లావాదేవీలపై సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించే విధానాన్ని కూడా పరిశీలించాలి' అని ధర్మాసనం సూచించింది. లావాదేవీని పూర్తి చేసిన తర్వాత నివేదికలు తయారు చేయడం కంటే, డబ్బు చేతులు మారకముందే దాన్ని నిరోధించడం ముఖ్యమని స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్టు మోసాలను అరికట్టడానికి బ్యాంకుల చర్యలు మాత్రమే సరిపోవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా నమోదైన కేసులు, వాటిపై జరుగుతున్న దర్యాప్తులు, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించింది. రాష్ట్రాల పోలీసు డైరెక్టర్ జనరల్‌లు ఈ ఆదేశాల అమలును నిర్ధారించాలని తెలిపింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ అంతర్‌శాఖల సమన్వయ కమిటీకి అందించాలని కూడా ధర్మాసనం సూచించింది. రిజర్వు బ్యాంకు ప్రతిపాదిత నిబంధనలను పరిశీలించి, అమలు చేయాల్సిన చర్యలపై తదుపరి నిర్ణయాలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు విచారణను నవంబరు 30కు వాయిదా వేసింది. అప్పటిలోగా సంబంధిత ఆర్థిక సంస్థల వివరాలను సమర్పించాలని రిజర్వు బ్యాంకును ఆదేశించింది.

పాడెనెక్కిన పంటలు!

మొదటి పేజీ తరువాయి

చేతికి వచ్చే సమయంలో పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విపత్తు ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాలపై అత్యంత తీవ్రంగా పడింది. ఉమ్మడి మహబూబ్ నగర్, న



చుక్కనీరు లేక వెలవెలబోతున్న మంజీరా ప్రాజెక్టు



మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో ఖాళీ బిందెలతో బోరుబావి వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

రాష్ట్రంలో ట్యాంకర్ల ఎత్తిపోతలు

పంటల కోసం రైతులు సెల్ఫ్ డిక్లరేషన్.. మళ్లీ జనరేటర్లు, ట్యాంకర్లు మోహైనయ్

కాంగ్రెస్‌కు హాలీడే ఇస్తేనే దరిద్రం పోతది.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడేమో రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పంటలు తామే కాపాడుకుంటామని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన దుస్థితి నేడు తెలంగాణలో ఏర్పడిందని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు వల్ల జనరేటర్లు, ట్యాంకర్లతో తెలంగాణ రైతులు పంటల్ని కాపాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. రైతులు తమ పంటల్ని తామే తగలబెట్టుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల ఎత్తిపోతలు పోయి ట్యాంకర్ల ఎత్తిపోతలు నడుస్తున్నాయని ఆరోపించారు. 420 హామీలకు హాలిడే.. ఆరు గ్యారెంటీలకు హాలిడే.. క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, పీఆర్సీకి హాలిడే, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు హాలిడే.. ఇలా అన్నింటికీ హాలిడే ప్రకటించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే మనం హాలిడే ఇస్తే దరిద్రం పోతుందని పిలుపునిచ్చారు. కరువు పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులు విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో చేపట్టిన ప్రాజెక్టును వెంటనే నిలిపివేసి, ఆ లక్షన్నర కోట్ల రూపాయలను ప్రజల సంక్షేమానికి, రైతుల ఉపశమనానికి వినియోగించాలని సూచించారు.

మూసీ సుందరీకరణ ఎందుకు?

సాగునీళ్లు లేక, కరెంట్ కోతలతో ఓ వైపు పంటలు ఎండిపోతుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. మూసీ సుందరీకరణ ఎవరు అడిగారని.. డీపీఆర్ లేకుండానే లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్‌రెడ్డి ఆడుతున్న డ్రామాలను వెంటనే బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నివేదికలు, ప్రజల అంగీకారం లేకుండా తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్న ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ ఎలాంటి లాభం లేదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టును వెంటనే ఆపి ఆ లక్షన్నర కోట్లతో ప్రజలను ఆదుకోవాలని కోరారు. తాగునీటికి కష్టాలు ఉన్నప్పటికీ రూ.1,50,000 కోట్లతో మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో వర్షాలు లేక కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా, తాగునీటి ఎద్దడి ఉన్నా పట్టించుకోకుండా ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు కేటాయించి దానిపైనే పూర్తిగా దృష్టి పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. మూసీ సుందరీకరణపై ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలను, బాధితులను, ప్రజాప్రతినిధులను మాట్లాడనివ్వకుండా అణచివేశారని.. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. మూసీ బాధితుల తరఫున, ప్రజల పక్షాన నిలబడి గట్టిగా పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణకు సంబంధించి ఎలాంటి డీపీఆర్ లేకపోయినా, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అప్పు పేరుతో లూటీకి తెరలేపారని విమర్శించారు. వ్యవసాయం చేసుకుంటే మీ కర్మ అనేలా కాంగ్రెస్ పాలన ఉన్నదని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగి మూడేండ్లు అవుతున్నా, ప్రభుత్వం దానిపై ఎలాంటి విచారణ జరపకుండా కేవలం కాలయాపన చేస్తున్నదని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించకుండా, రైతులకు నీళ్లు అందించకుండా ప్రభుత్వం కాలం వెళ్లదీస్తున్నదని ఆరోపించారు.

కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదు

రాష్ట్రంలో పరిశ్రమలకు పవర్ హాలిడేస్ ప్రకటించడం వల్ల పారిశ్రామిక రంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో ఇండస్ట్రీలు మూతపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదు.. కరెంట్ ఉంటే కాంగ్రెస్ ఉండదు అనేది ఈరోజు నిజమవుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో రైతులకు సాగునీరు అందక, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతుండగా, పరిశ్రమలకు కూడా విద్యుత్ కోతలు విధించే పరిస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యమని విమర్శించారు. కరువు, కరెంట్ కోతలతో రాష్ట్రం తల్లడిల్లుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రజల సమస్యలను పక్కనపెట్టి ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు. రాష్ట్రం రాహుల్‌గాంధీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇంత అవినీతి, కరువు కాటకాలు, పరిపాలనా వైఫల్యం ఉన్నప్పటికీ ఇప్పటిదాకా రాహుల్‌గాంధీ స్పందించడం లేదని విమర్శించారు.

అది గోబెల్స్ సమ్మిట్

రాష్ట్రం కరువుతో, కరెంట్ కోతలతో తల్లడిల్లుతుంటే గ్లోబల్ సమ్మిట్ పేరుతో గోబెల్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒకవైపు పొదుపు మంత్రం పాటించాలని చెబుతూ, పదుల కోట్ల రూపాయలు ప్రచారం కోసం, ఫ్లెక్సీల కోసం, ప్రకటనల కోసం దుబారా చేస్తున్నారని ఆరోపించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక కొత్త పెట్టుబడి, కొత్త ఉద్యోగం తీసుకురాలేకపోయిందని అన్నారు. రాష్ట్రంలో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని స్వయంగా ప్రభుత్వమే చెప్పిందని గుర్తు చేశారు. తాము దిగిపోయేనాటికి 9,46,000గా ఉన్న ఐటీ ఉద్యోగాలు.. కాంగ్రెస్ సర్కారు వచ్చాక 7,000 వరకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ పేరుతో వేల కోట్ల రూపాయలను తమ ప్రచారం కోసం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ వల్ల ఒక్క పెట్టుబడి, ఒక్క ఉద్యోగం రాలేదని, అందుకే అది గోబెల్స్ సమ్మిట్ అని విమర్శించారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే గ్లోబల్ సమ్మిట్ ఎందుకు పెడుతున్నారో తమకు తెలియదని అన్నారు. రాష్ట్రంలో కరెంట్ లేదని, నీళ్లు లేవని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పెట్టుబడిదారులకు చెబుతారా? అని ప్రశ్నించారు. పవర్ హాలిడే ఇచ్చే రాష్ట్రంలో ఎవరు పెట్టుబడులు పెడతారని నిలదీశారు. ఈ మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన విదేశీ పర్యటనలు, ప్రకటించిన ఎంఓయూలు, వచ్చిన పెట్టుబడులు, కొత్తగా ఇచ్చిన ఉద్యోగాలెన్నో వివరాలతో వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో తాము ఎలాంటి గ్లోబల్ సమ్మిట్లు పెట్టకుండానే పదేళ్లలో లక్షల కోట్ల పెట్టుబడులు తేగలిగామని పేర్కొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

అనిరుధ్ రెడ్డిపై చర్యలు తప్పవు: టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. "జడ్చర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం" అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్చర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



నిమ్స్‌లో మరోసారి ఏసీబీ తనిఖీలు

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో మరోసారి ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. నిమ్స్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్ వ్యవహారంలో ఏసీబీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. క్యాంటీన్‌తో పాటు మెడికల్ స్టోర్స్ నుంచి పెద్ద ఎత్తున లంచాలు వెళ్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఏసీబీ సోదాలు చేపట్టింది. మెడికల్ స్టోర్స్ క్యాంటీన్ లో నుంచి రూ. 50 లక్షల వరకు లంచాల రూపంలో వెళ్లినట్లు ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. గత నెలలో నిమ్స్ ఆస్పత్రిలో భారీ అవినీతి వెలుగు చూడటంతో.. నిమ్స్ పరిపాలనా విభాగంలో రికార్డులను ఏసీబీ అధికారులు మరొకసారి పరిశీలిస్తున్నారు. ఒకవైపు నిమ్స్ క్యాంటీన్‌లో నలుగురు అధికారులు తనిఖీలు చేపట్టగా, మరొకవైపు సర్జికల్ స్టోర్‌లో మందులు, పరికరాల నిల్వలను మరో నలుగురు అధికారుల బృందం తనిఖీలు చేసింది. ఏకకాలంలో ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అధికారులు సోదాలు చేపట్టి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఓబీసీ కాలమ్ పెట్టాలని అమిత్ షాను అడగాలి

ఆర్ కృష్ణయ్యతో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): త్వరలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తున్నారని.. ఓబీసీ కాలమ్ పెట్టాలని అడగాలని ఆర్ కృష్ణయ్యతో మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సచివాలయంలో రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య పొన్నంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడి అన్ని రాజకీయ పార్టీల బీసీ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, బీసీ సంఘాల ప్రతినిధులను కలుపుకొని వెళ్లి ఓబీసీ కాలమ్ ఒక్కటే డిమాండ్‌తో అడగాలని కోరారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనతో పాటు కుల గణనను కూడా నిర్వహించాలి. అందులో ఎస్సీ, ఎస్టీలతో పాటు తప్పనిసరిగా 'ఓబీసీ' (గాదీజ) కాలమ్ చేర్చాలి. గతంలో జన గణనలో కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు 14న ఇచ్చిన 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీ అదర్స్ అని ఉంది ఓబీసీ లేదు. కులాల వారీగా లెక్కలు అడగడం లేదు.. కులాల లెక్కలు ఉంటేనే ఓబీసీ లెక్కలు తెలుస్తయి.

రాజకీయాల నుంచి తప్పుకుంటా: ఈటల

కేంద్రం నిధులు తెచ్చి తీరుతానని శపథం



మల్కాజిగిరి, అక్టోబర్ 29 (ఈవార్తలు)జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తన ఆందోళనను ఉద్ధృతం చేశారు. డంపింగ్ యార్డ్ తరలింపునకు తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తే.. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ప్రకటించారు. ఒకవేళ నిధులు మంజూరు చేయించడంలో విఫలమైతే రాజకీయాలకు గుడ్‌బై చెబుతానని సవాల్ విసిరారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆయన చేపట్టిన 'జవహర్‌నగర్ జన సంకల్ప యాత్ర' గురువారం మూడో రోజుకు చేరింది. జవహర్‌నగర్‌లోని చెత్త డంపింగ్ యార్డ్‌ను శాశ్వతంగా తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ కోరారు. ముందుగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందిస్తే.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి అవసరమైన నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనగలమనే నమ్మకంతోనే ప్రజల్లోకి వచ్చానని ఆయన పేర్కొన్నారు. కీసర నుంచి ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా గురువారం స్థానికులు ఈటల రాజేందర్‌కు స్వాగతం పలికారు. కీసరలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఆరుగురు ముఖ్యమంత్రులతో వివిధ అంశాలపై పోరాడినట్లు తెలిపారు. ఇప్పుడు కూడా డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న కలుషిత ద్రవ వ్యర్థాలు స్థానిక చెరువులు, భూగర్భ జలాలను ప్రభావితం చేస్తున్నాయని ఈటల రాజేందర్ ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల నుంచి ఆకుపచ్చ రంగులో నీరు వస్తోందని పేర్కొంటూ.. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాంకీ సంస్థ పనితీరుపైనా ఆయన విమర్శలు చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు 1,300 ఎకరాల పంపిణీ: భట్టి



హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక సమగ్ర వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. సబ్ ప్లాన్ ప్రత్యేక అభివృద్ధి నిధులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడి గడపకూ చేరాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి వ్యవసాయం, ఇంధనం, వైద్యారోగ్యం, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ల నుంచి అందిన డేటా ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 1,300 ఎకరాల ప్రభుత్వ ఖాళీ భూమి అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ భూములను త్వరితగతిన వినియోగంలోకి తెచ్చి, అర్హులైన నిరుపేద కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అన్ని అనుమతులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అలాగే నివాస స్థలాలు లేని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు స్థలాల కొనుగోలు, అవసరమైతే భూసేకరణ ప్రతిపాదనలను కూడా వెంటనే పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యంత్రాల పంపిణీ వంటి పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని భట్టి విక్రమార్క చెప్పారు. భూమి ఉన్న రైతులతో పాటు ఎస్సీ రైతులందరికీ పూర్తి ప్రయోజనం అందేలా నిబంధనల్లో మార్పులు అవసరమైతే ప్రత్యేక పథకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పథకాల వారీగా లబ్ధి పొందిన రైతుల పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గాల వివరాలను పక్కాగా ధ్రువీకరించి, డేటాను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ ప్రజల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాళ్లు, వైకుంఠ ధామాలు (శ్మశాన వాటికలు) నిర్మించాలని, మౌలిక వసతులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. గిరిజన గూడేలు, ఎస్సీ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, కొత్త వైరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ముఖ్యంగా ఏజెన్సీ ఏరియాల్లో అత్యవసర వైద్య సేవల విస్తరణకు వీలుగా 'మొబైల్ మెడికల్ యూనిట్లు' ఏర్పాటు చేసే ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సీనియర్ ఉన్నతాధికారులు నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ సుల్తానియా, సురేంద్ర మోహన్, సిక్తా పట్నాయక్, క్రిస్టినా, విజయేంద్ర బోయి, గోపి, గుగులోతు రవి నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ముదిరాజ్' బీసీ-ఏపై సమగ్ర అధ్యయనం

బీసీ కమిషన్ కీలక ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి మార్చే అంశంపై సమగ్ర అధ్యయనం తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలంగాణ బీసీ కమిషన్ స్పష్టం చేసింది. కులాల వర్గీకరణలో మార్పులు చేపట్టే ముందు ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేరిస్తే ఇప్పటికే ఆ గ్రూపులో ఉన్న 57 కులాలపై, అలాగే బీసీ-డీ గ్రూపులోని 34 కులాలపై ఎలాంటి ప్రభావం పడుతుందన్న అంశాన్ని అధ్యయనం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సీపెక్ సర్వే ద్వారా ఇప్పటికే సేకరించిన కులాల సమాచారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కమిషన్ వెల్లడించింది. బుధవారం బీసీ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో కమిషన్ సభ్యులు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మితోపాటు కార్యదర్శి బాల మాయాదేవి పాల్గొన్నారు. ముదిరాజ్ కులాన్ని బీసీ-ఏలోకి మార్చాలన్న ప్రతిపాదనతోపాటు ఇతర కులాల నుంచి వచ్చిన విజ్ఞాపనలపై సమావేశంలో చర్చించారు. వర్గీకరణలో మార్పులు ఒక సామాజిక వర్గానికి ప్రయోజనం కలిగించే క్రమంలో మరో వర్గానికి అవకాశాలు తగ్గకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని కమిషన్ భావిస్తోంది. అందువల్ల కులాల జనాభా, సామాజిక వెనుకబాటుతనం, విద్యా అవకాశాలు, ఉద్యోగ ప్రాతినిధ్యం వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించిన తర్వాతే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



రాజన్న ఆలయం వద్ద 150 మందికి అన్నదానం

వేములవాడ అర్బన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): వేములవాడ రాజన్న ఆలయం వద్ద మై వేములవాడ అన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం 150 మంది పేదలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. దాతల సహకారంతో ట్రస్టు అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అన్నదాతలుగా చిరంజీవి సాగరం సూరజ్ మౌర్య పుట్టినరోజు సందర్భంగా ఆయన తల్లిదండ్రులు సంతోష్ కుమార్, మౌనిక దంపతులు; వొజ్జల సతీష్ కుమార్, శారద దంపతులు; పొలాస నాగలక్ష్మి జ్ఞాపకార్థం పొలాస శాంతకుమారి (అమెరికా), పొలాస బాలకిషన్-సరస్వతి దంపతులు; పొలాస వాణిశ్రీ, పొలాస శ్రీనివాస్-రేణుక దంపతులు, వారి కుటుంబ సభ్యులు సహకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నదాన శాశ్వత సభ్యులుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత, ప్రతాప-స్వప్న, సంపత్, నగుబోతు రవీందర్-జ్యోతి, గణాచారి మఠం శైలజ-సాంబశివు, దేవరాజు-ఉమ, బాలచందర్ రాజు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ ఉన్నారని పేర్కొన్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు తదితర సందర్భాల్లో అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను లేదా 9246939388 నంబరును సంప్రదించాలని నిర్వాహకులు మధు మహేష్ కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గొంగళ్ల రవికుమార్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, పొలాస రాజేందర్, నక్క వేణు, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్, గొట్టం శ్రీనివాస్ పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణంలో వేగం పెరగాలి

అధికారులకు సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు

చందుర్తి, అక్టోబర్ 29 (ఈవార్తలు): చందుర్తి మండలం మూడపెల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత నివాస విద్యాలయం పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.200 కోట్లతో చేపట్టిన విద్యాలయ నిర్మాణ పనులను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ విద్యాలయాల నిర్మాణాన్ని ప్రణాళిక ప్రకారం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో వేములవాడ ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రామకృష్ణ, తహసీల్దార్ భూపతి, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నుంచి శబరిమలకు మహాపాదయాత్ర

ఐదో రోజుకు చేరుకున్న గురుస్వాముల బృందం

కూకట్‌పల్లి, అక్టోబర్ 29 (ఈవార్తలు): హైదరాబాద్ నుంచి శబరిమల వరకు చేపట్టిన మహాపాదయాత్ర ఐదో రోజుకు చేరుకుంది. శ్రీ వేణుగోపాల గురుస్వామి పాదయాత్ర బృందం ఆశీస్సులతో, పవన్ గురుస్వామి ఆధ్వర్యంలో గురుస్వామి దొడ్ల రామకృష్ణ గౌడ్ ఈ యాత్రలో పాల్గొంటున్నారు. యాత్రలో భాగంగా గురువారం స్వాములు కొత్తకోటలోని శివాజీ మహారాజ్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. బృందంలో రాజు గురుస్వామి, మనీష్ స్వామి, చింటూ స్వామి తదితరులు ఉన్నారు.

కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.1.23 కోట్లు

మల్యాల, అక్టోబర్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ.1,23,00,984 ఆదాయం సమకూరింది. గత 76 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. అంజనా రెడ్డి ఆధ్వర్యంలో 14 హుండీలను తెరిచి, శివశక్తి సేవా సమితి, శ్రీశక్తి సేవా ట్రస్ట్ ప్రతినిధులు కానుకలను లెక్కించారు. నగదుతో పాటు 68 విదేశీ కరెన్సీ నోట్లు లభ్యమయ్యాయి. కానుకల్లో వచ్చిన మిశ్రమ వెండి, బంగారాన్ని సంచిలో భద్రపరిచి ముద్ర వేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకుడు రాజమోగిలి పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. ఆలయ ఏఈవో గుండి హరిహరనాథ్, పర్యవేక్షకుడు సునీల్ కుమార్, ప్రధాన అర్చకుడు మారుతి ప్రసాద్, ఉప ప్రధాన అర్చకుడు అనిల్ కుమార్, పరిశీలకులు అశోక్, లక్ష్మారెడ్డి, ధర్మేందర్, శ్రీనివాస్‌తో పాటు ఆలయ సిబ్బంది, పోలీసు, భద్రతా సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ మార్కెట్ అభివృద్ధికి రూ.3.94 కోట్లు

వేములవాడ అర్బన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.94 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు తెలిపారు. ఈ నిధుల విడుదలపై చైర్మన్, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రొండి రాజు మాట్లాడుతూ, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో మార్కెట్ యార్డు ఏర్పాటుకు 12 ఎకరాల భూమిని జిల్లా కలెక్టర్ కేటాయించారని తెలిపారు. అక్కడ మార్కెట్ కమిటీ భవనం, కార్యదర్శి భవనం, కొత్త మార్కెట్ యార్డు నిర్మాణానికి సుమారు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించినట్లు వివరించారు. ప్రభుత్వం ప్రస్తుతం రూ.3.94 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మర్రిపల్లి మార్కెట్ యార్డులో స్థలాన్ని శుభ్రపరచడం, మైదానాన్ని చదును చేయడం, ప్రహరీ నిర్మాణం, శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం, పురుషులు, మహిళలకు మరుగుదొడ్లు, ప్రధాన రహదారి నుంచి అనుసంధాన రహదారి, విద్యుదీకరణ, ఎత్తైన దీపాల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వేములవాడ మార్కెట్ యార్డులోని కప్పబడిన షెడ్‌ను 20 వ్యాపార గదులుగా మార్చనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 11 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు లభించాయని చెప్పారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి సరోజ, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు దైత కుమార్, ఖమ్మం గణేష్, గుర్రం విద్యాసాగర్, మ్యాక ప్రవంతి, హరి నందన్ రెడ్డి, కత్తి కనకయ్య, వస్తాద్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనకు విద్యార్థులు

కూరగాయల మార్కెట్‌ను సందర్శన

వేములవాడ అర్బన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించేందుకు వేములవాడలోని గౌతమ్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మార్కెట్‌లో విక్రయించే కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించి వాటి పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకున్నారు. కూరగాయల తూకం వేయడం, కొనుగోళ్లు చేయడం, నగదు లావాదేవీలు, చిల్లర లెక్కించడం వంటి అంశాలను ప్రత్యక్షంగా గమనించారు. రైతులు, విక్రేతలతో మాట్లాడి వారి రోజువారీ పని, మార్కెట్ వ్యాపార నిర్వహణ గురించి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పౌష్టికాహారం, కూరగాయల ప్రాముఖ్యతతో పాటు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. పుస్తకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా విషయాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుజ్జ సత్యంకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలి

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): బీసీ హక్కుల సాధన, సామాజిక న్యాయం, విద్యారంగ అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న గుజ్జ సత్యం (గుజ్జ సత్యనారాయణ)కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని వివిధ సామాజిక వర్గాలు, చేనేత, బీసీ సంఘాలు, విద్యా, వైద్య రంగాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ నిబంధనలు, అర్హతలకు అనుగుణంగా ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కాచిగూడలోని హోటల్ మహారాజాలో చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ డిమాండ్ చేశారు. చేనేత కార్మికులు, పద్మశాలి సమాజం, బీసీ సంఘాలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను శాసనమండలిలో వినిపించేందుకు తగిన ప్రాతినిధ్యం అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలపై పనిచేస్తున్న బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణతో పాటు వివిధ జిల్లాలకు చెందిన బీసీ, ప్రజాసంఘాలు గుజ్జ సత్యం అభ్యర్థిత్వానికి మద్దతుగా తీర్మానాలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమం, నాణ్యమైన విద్య, చేనేత కుటుంబాల ఉపాధి, మార్కెటింగ్, ప్రభుత్వ పథకాల అమలుపై ఆయనకున్న అవగాహన శాసనమండలికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ది జగదీశ్, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ కోశాధికారి పుట్టబత్తిని జ్ఞానేశ్వర్, పద్మశాలి నాయకులు జిల్లా నరేంద్ర, వంగాల బాలరాజ్, గంజి వెంకటేశం, వెంకట్రామయ్య, రాజు, సోషలిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి కేవీ గౌడ్, బీసీ మహిళా నాయకురాలు సోమకవిత తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలపై యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యం

14 రాష్ట్రాలు, యూటీల్లో యువ సంవాద్ కార్యక్రమాలు

హైదరాబాద్, అక్టోబర్ 29 (పీఐబీ): ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు, పౌర బాధ్యతలపై యువతలో అవగాహన పెంపొందించేందుకు 'వికసిత్ భారత్ యువ సంవాద్: నో యువర్ వోట్' కార్యక్రమాలను మేరా యువ భారత్ (మై భారత్) నిర్వహిస్తోంది. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 10 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. అక్టోబరు 26 నుంచి నవంబరు 5 వరకు దేశవ్యాప్తంగా 500 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో ఈ ప్రచారం నిర్వహిస్తున్నారు. తొలిసారి ఓటు వేయనున్న యువతతో పాటు ఇతర విద్యార్థులు ప్రజాప్రతినిధులతో నేరుగా మాట్లాడి, వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యంపై తమ అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పిస్తున్నారు. అక్టోబరు 28 నాటికి దేశవ్యాప్తంగా 27 యువ సంవాద్ కార్యక్రమాలు నిర్వహించగా, 5,856 మంది యువత పాల్గొన్నారు. ఢిల్లీ, గురుగ్రామ్, పంచకుల, రాజౌరీ, జజ్జర్ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల అవగాహన, యువ నాయకత్వం, బాధ్యతాయుత పౌరసత్వంపై చర్చలు నిర్వహించారు. షియోపూర్‌లో ఎంపీ శివమంగళ్ సింగ్ తోమర్ విద్యార్థులతో మాట్లాడారు. రాయ్‌గఢ్‌లో ఎంపీ రాధేశ్యామ్ రాథియా, మై భారత్ జాయింట్ డైరెక్టర్ రమణ్ పటేల్ పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఫన్సిదేవాలో మై భారత్ డార్జిలింగ్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన చర్చలు, ప్రతిజ్ఞ, ప్రజాస్వామ్య విలువలపై సంతకాల కార్యక్రమం నిర్వహించారు. దేశవ్యాప్తంగా యువతలో ఎన్నికలపై అవగాహన పెంచడం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.





విద్యార్థులతో మమేకమైన కోరుట్ల ఎమ్మెల్యే

మల్లాపూర్, అక్టోబర్ 29 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ మల్లాపూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడి పాత్రలో ప్రశ్నలు అడిగి వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. విద్యాభ్యాసం, పాఠశాలలోని పరిస్థితులను పరిశీలించారు. విద్యాలయంలో మౌలిక వసతుల కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణం సహా ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి చిట్యాల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీలత, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ముద్దం శరత్‌గౌడ్, బండి లింగస్వామిగౌడ్, కదురు నర్సయ్య, మ్యాకల సతీష్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద మృతుడి కుటుంబానికి రూ.5 లక్షలు

ధర్మపురి, అక్టోబర్ 29 (ఈవార్తలు): విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున రూ.5 లక్షల పరిహారం అందజేశారు. ఎండపల్లి మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన లింగాల చిన్నయ్య గత ఏడాది సెప్టెంబరు 2న పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ నేపథ్యంలో గురువారం బసంత్‌నగర్ విద్యుత్ శాఖ ఏఈ మానాల ప్రసాద్ ఆధ్వర్యంలో మృతుడి భార్య లింగాల సుశీలకు పరిహారం చెక్కు అందించారు. గ్రామ సర్పంచి బాల్సాని శారద-మల్లేష్ గౌడ్ సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. పరిహారం కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని సర్పంచి పేర్కొన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నర్సింగం, లైన్‌మెన్ శ్రీనివాస్, జేఎల్ఎం నాగరాజు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చొప్పదండిలో ఆరింటిని కరువు మండలాలుగా ప్రకటించాలి

ఎండిన పంటలకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలి

క్రాప్ హాలిడే కింద రూ.50 వేలు చెల్లించాలి: మాజీ ఎమ్మెల్యే సుంకె

గంగాధర, అక్టోబర్ 29 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాలనూ కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు ప్రభావిత మండలాల జాబితాలో ఒక్క మండలానికే చోటు కల్పించి, మిగతా ప్రాంతాలను విస్మరించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు నీటి ట్యాంకర్లు, జనరేటర్ల కోసం అదనపు ఖర్చులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, పంటల సాగును నిలిపివేసే పరిస్థితి వచ్చిన రైతులకు క్రాప్ హాలిడే కింద ఎకరాకు రూ.50 వేల సాయం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. రైతుబంధు, రైతుభరోసా, రుణమాఫీ హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. వ్యవసాయ పనులు లేక ఉపాధి కోల్పోతున్న కూలీలను కూడా ఆదుకోవాలని సూచించారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

5న బీజేపీ 'చలో కరీంనగర్' మహాపాదయాత్ర

వేములవాడ అర్బన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): నవంబరు 5న కరీంనగర్‌లో బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాపాదయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో 'చలో కరీంనగర్' కార్యక్రమానికి సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేశ సమగ్రతకు విఘాతం కలిగించే శక్తుల కార్యకలాపాలను తిప్పికొట్టేందుకు చేపడుతున్న పాదయాత్రలో భాగంగా కరీంనగర్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. అటు.. జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన చిట్యాల రాజు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన నేరెళ్ల సాయికుమార్, పట్టణ ఎండోమెంట్ కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన రేణుకింద అశోక్, కో-కన్వీనర్‌గా ఎన్నికైన బిల్లా కృష్ణార్లను నాయకులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోల కృష్ణస్వామి, రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్ కొండ్లీపు ముత్యం, రేగుల శ్రీకాంత్, వాసం మల్లేశం యాదవ్, రేగుల రాజకుమార్, వివేక్ రెడ్డి, ఎడ్ల కమలాకర్, కటకం శ్రీనివాస్, చిక్కుడు మల్లేశం, చేపూరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం.. నీటి పొదుపుపై రైతులకు అవగాహన

బోయినపల్లి, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, యాసంగిలో తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని టీఆర్‌వీకే సమన్వయకర్తలు రైతులకు సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండలో 'ఎల్‌నినో ప్రభావం-నీటి పొదుపు' అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో వ్యవసాయ విద్యార్థులు, టీఆర్‌వీకే సమన్వయకర్తలు డాక్టర్ ఆర్. సాయి కుమార్ (వేములవాడ), పి. మధుకర్ రావు (కరీంనగర్) పాల్గొన్నారు. వర్షపాతం తగ్గితే భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వారు వివరించారు. యాసంగి సాగులో నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో నీటి పొదుపు, పంటల మార్పిడిపై గోడలపై నినాదాలు రాసి అవగాహన కల్పించారు. రైతులతో నీటిని వృథా చేయకుండా సంరక్షిస్తామని, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సర్పంచి శ్రీనివాస్, ఉప సర్పంచి వెంకటేష్, రైతులు, వ్యవసాయ విద్యార్థులు సాయి చందన, కిరణ్, నివేదిత, వర్షిణి, నిరంజన తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ పాఠశాలకు విద్యాశాఖ నోటీసులు

ఫీజు బకాయి కారణంగా విద్యార్థినిని పరీక్షకు అనుమతించలేదన్న ఆరోపణలు

జగిత్యాల, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఫీజు బకాయి కారణంగా రెండో తరగతి విద్యార్థినిని పరీక్షకు అనుమతించలేదన్న ఆరోపణలపై జగిత్యాల విద్యాశాఖ స్పందించింది. ఈ ఘటనపై వార్తా ఛానల్‌లో కథనం ప్రసారమైన నేపథ్యంలో జిల్లా విద్యాధికారి మౌఖిక ఆదేశాల మేరకు సంబంధిత రామకృష్ణ ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనపై రెండు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. పాఠశాల సమర్పించే వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. సదరు విద్యాసంస్థ అధిక ఫీజులు వసూలు చేస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్న నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మార్పీఎస్

ఫీజు బకాయి కారణంగా విద్యార్థినిని పరీక్షకు అనుమతించలేదన్న ఆరోపణలపై రామకృష్ణ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు దుమాల గంగారాం మాదిగ మాట్లాడుతూ, రూ.6 వేల ఫీజు చెల్లించినప్పటికీ విద్యార్థినిని పరీక్షకు అనుమతించలేదని ఆరోపించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వసూళ్లు, నిబంధనల ఉల్లంఘనలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే సోమవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'చలో కలెక్టరేట్' నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, బెజ్జంకి సతీష్ మాదిగ, బోనగిరి కిషన్ మాదిగ, బొల్లారం దివాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, అక్టోబర్ 29 (ఈవార్తలు): అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 33వ వార్డుకు చెందిన కుక్కల అఖిల భర్త శ్రీకాంత్‌కు మంజూరైన రూ.1,06,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆపద సమయంలో అర్హులైన పేదలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాత రాముకుమార్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి

ఎమ్మెల్యేకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

జగిత్యాల, అక్టోబర్ 29 (ఈవార్తలు): మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని, అల్పాహార పథకాన్ని కూడా మధ్యాహ్న భోజన కార్మికులతోనే నిర్వహించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేసింది. జిల్లావ్యాప్తంగా జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన పెండింగ్ వంట బిల్లులను విడుదల చేయాలని, కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలని యూనియన్ కోరింది. కోడిగుడ్లు, వంటగ్యాస్, నిత్యావసర సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా కల్పించాలని విజ్ఞప్తి చేసింది. గతంలో అల్పాహారం వండినందుకు రావాల్సిన బిల్లులు, పారితోషిక బకాయిలను చెల్లించాలని, రాజకీయ ఇతర కారణాలతో కార్మికులను తొలగించవద్దని పేర్కొంది. ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున భోజన ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పీ. ప్రేమ పావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వెన్న మహేష్ కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: నవీన్

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): హైదరాబాద్–మహబూబ్‌నగర్–రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది నవీన్ పటేల్ కోరారు. బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాగంటి సునీత గోపీనాథ్ ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటరు నమోదు సహాయ కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడికి వచ్చినవారి సందేహాలను



నివృత్తి చేశారు. అర్హులైన పట్టభద్రులు నవంబరు 6లోగా ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు ఉపయోగపడేలా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసిన మాగంటి సునీత గోపీనాథ్‌కు నవీన్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

కేజీబీవీలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన

జగిత్యాల, అక్టోబర్ 29 (ఈవార్తలు): బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, లైంగిక వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సరిత మట్టా సూచించారు. జగిత్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పోక్సో చట్టం–2012పై నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. 18 ఏళ్లలోపు పిల్లలను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు ఈ చట్టాన్ని రూపొందించారని తెలిపారు. అనుచితంగా తాకడం, అసభ్యంగా ప్రవర్తించడం, అంతర్జాలంలో అసభ్య సందేశాలు పంపడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే పెద్దలకు తెలియజేయాలని సూచించారు. బాధిత బాలల గోప్యతను కాపాడి, వారికి భద్రతతో కూడిన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేశ భద్రతకే సర్ ప్రక్రియ: డీకే అరుణ

మహబూబ్‌నగర్, అక్టోబర్ 29 (ఈవార్తలు): యువత దేశం కోసం నడుం బిగించాలని, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు విశ్వవిద్యాలయ గ్రంథాలయ ఆడిటోరియంలో మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘యువ సంసద్’ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, మత్తుకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ‘నషా ముక్త్ యువ భర్ వికసిత్ భారత్’ నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కూడా అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ అంశంపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడంతో పాటు దేశ భద్రతకు ఇది దోహదపడుతుందని డీకే అరుణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి వీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు, డీన్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సెల్ అధికారి డాక్టర్ ప్రవీణ, జిల్లా యువజన అధికారి కోటా నాయక్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్, ఉద్భవ్ సేవా సంసద్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ అర్జున్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భారత్‌లో 55 వేల మరణాలు?

న్యూఢిల్లీ: భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది.

మార్చి నాటికి ప్రమాదకరంగా ఎల్‌నినో

భారత్‌లో ఎండలపై తీవ్ర ఆందోళన

ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాలు!

వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా. ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు. ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది. అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

విమాన టికెట్ల ధరలు పెంచుతాం: ఇండిగో



న్యూఢిల్లీ: ఇంధన ఖర్చులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో విమాన టికెట్ల ధరలను పెంచక తప్పదని ఇండిగో సీఈఓ విల్లీ వాల్ష్ వెల్లడించారు. విమాన ఇంధన ధరల పెరుగుదల వల్ల కంపెనీపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆయన తెలిపారు. ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ వరుసగా మూడో త్రైమాసికంలోనూ నష్టాలను నమోదు చేసింది. ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో సదరు కంపెనీ రూ.1,879 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసినట్టు ప్రకటించింది. అయితే ఇదే సమయంలో ఈ సంస్థ ఆదాయం 26 శాతం పెరిగి రూ.23,364 కోట్లకు చేరింది. అయితే ఇంధన వ్యయాలు ఏడాది క్రితంతో పోలిస్తే 67 శాతం పెరగడంతో లాభదాయకతపై ప్రభావం పడింది. విమాన ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ఇండిగో అక్టోబర్ 6 నుంచి దేశీయ, అంతర్జాతీయ విమానాలపై చార్జీలను పెంచింది. దేశీయ ప్రయాణాలకు దూరాన్ని బట్టి రూ.375 నుంచి రూ.1,300 వరకు ఇంధన చార్జీలను వసూలు చేస్తోంది. ఈ చార్జీలు అంతర్జాతీయ మార్గాల్లో రూ.1,000 నుంచి రూ.10,000 వరకు ఉన్నాయి. యూరప్ వెళ్లే విమానాలకు మాత్రం అత్యధికంగా రూ.10,000 చార్జీ విధిస్తోంది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఇండిగో ప్రయాణికుల సంఖ్య 4.5 శాతం తగ్గి 2.75 కోట్లకు చేరింది. దాంతో ఈ సంస్థ ఖర్చులను నియంత్రించేందుకు విమాన సర్వీసుల సామర్థ్యాన్ని కూడా తగ్గించింది. డిసెంబర్ త్రైమాసికంలో సర్వీసు సామర్థ్యం స్వల్పంగా పెరుగుతుందని ఇండిగో అంచనా వేస్తోంది.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో అక్రమాలు?

విదేశీ జోక్యం అనుమానాలపై దర్యాప్తు.. ఆ దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆదేశాలు



జెరూసలేం: ఇజ్రాయెల్ పార్లమెంటు ఎన్నికల్లో విదేశీ శక్తుల జోక్యం జరిగిందన్న అనుమానాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కేంద్ర ఎన్నికల కమిటీ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి నోమ్ సోల్‌బర్గ్ దేశ భద్రతా సంస్థ షిన్ బెట్‌ను ఆదేశించారు. ఖతార్ నుంచి భారీగా నిధులు వచ్చి, అరబ్ ఓటర్ల ఓటింగ్‌పై ప్రభావం చూపేందుకు ప్రయత్నాలు జరిగి ఉండవచ్చని హిబ్రూ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఈ ఆరోపణలు ఇంకా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. సోల్‌బర్గ్ బుధవారం షిన్ బెట్ చీఫ్ డేవిడ్ జినీకి రాసిన లేఖలో.. ఇజ్రాయెల్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీ శక్తులు నిధుల ద్వారా ఎన్నికలను అనుచితంగా ప్రభావితం చేస్తున్నాయన్న తీవ్రమైన అనుమానాలు తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ అనుమానాల వాస్తవికతను తాను ధ్రువీకరించలేనప్పటికీ, విదేశీ సంస్థల ప్రమేయం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని తెలిపారు. వారంలోగా దర్యాప్తు వివరాలను సమర్పించాలని కోరారు. ఈ వ్యవహారంపై గత 2 వారాల్లోనే విశ్వసనీయ నిఘా సమాచారంతో దర్యాప్తు ప్రారంభించినట్లు ఓ భద్రతా అధికారి కన్ వార్తా సంస్థకు తెలిపారు. సమస్యాత్మక అంశాలు ఉన్నట్లు గుర్తించామని, పూర్తి సమాచారాన్ని వెలికితీసేందుకు విచారణ కొనసాగిస్తున్నామని చెప్పారు. ఖతార్ అరబ్ సంస్థలకు భారీగా నిధులు అందించి, ఓటర్లను పోలింగ్‌కు రప్పించడం లేదా వారి ఓటింగ్‌పై ప్రభావం చూపేందుకు ప్రయత్నించి ఉండవచ్చని కొన్ని హిబ్రూ మీడియా సంస్థలు భద్రతా వర్గాలను ఉటంకిస్తూ తెలిపాయి. ఈ నిధుల బదిలీకి ఉపయోగించిన మార్గాలు గతంలో ఉగ్రవాద కార్యకలాపాలకు డబ్బు చేరవేసేందుకు ఉపయోగించిన పద్ధతులను పోలి ఉన్నాయని ఛానల్ 12 పేర్కొంది. ఇజ్రాయెల్ ఎన్నికల్లో విస్తృత స్థాయిలో ఓటింగ్ అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల కమిటీ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డీన్ లివ్నే ఖండించారు. ఎన్నికలు చట్టబద్ధంగా జరిగాయని, తమకు తెలిసినంతవరకు వ్యవస్థాగత అక్రమాలకు ఆధారాలు లేవని తెలిపారు. సోల్‌బర్గ్ కోరిన దర్యాప్తు రహస్య నిఘా సమాచారానికి సంబంధించినదని, దాన్ని ఇంకా ధ్రువీకరించాల్సి ఉందని వివరించారు. మరోవైపు, అరబ్ పార్టీల వల్ల ఎన్నికల చోరీ జరిగిదంటూ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ ఆరోపించింది. ఖతార్ పేరు ప్రస్తావించకుండా, విదేశీ శక్తులు ఇజ్రాయెల్ పార్లమెంటును తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించాయని పేర్కొంది. అరబ్ పార్టీలతో ఏ జియోనిస్ట్ పార్టీ కూడా పొత్తు పెట్టుకోకూడదని వాదించింది. అరబ్ ఓటర్లలో అధిక పోలింగ్ నమోదవడంతో రామ్, జాయింట్ లిస్ట్ పార్టీలు కలిపి రికార్డు స్థాయిలో 19 స్థానాలు గెలుచుకునే అవకాశం ఏర్పడింది. 120 స్థానాలున్న పార్లమెంటులో నెతన్యాహు కూటమికి 53, జియోనిస్ట్ ప్రతిపక్షానికి 48 స్థానాలు వస్తాయని తుది దశకు చేరిన లెక్కలు సూచించాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో అరబ్ పార్టీలు కీలక పాత్ర పోషించే పరిస్థితి నెలకొంది.



ఉక్రెయిన్ రైల్వే స్టేషన్‌పై రష్యా దాడి.. 13 మంది మృతి

మాస్కో: ఉక్రెయిన్‌లోని డ్నిప్రో నగర ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైలు నిలిచి ఉన్న ప్లాట్‌ఫామ్‌పై రష్యా డ్రోన్ దాడి జరిగి 13 మంది మరణించారు. గురువారం ఉదయం జరిగిన ఈ దాడిలో మరో 10 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. దాడి సమయంలో అక్కడ ప్రయాణికుల రైళ్లు ఉన్నాయని తెలిపారు. ఉక్రెయిన్ రైల్వే సంస్థ టెలిగ్రామ్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం.. జెట్ ఇంజిన్‌తో నడిచే డ్రోన్‌తో రష్యా ఈ దాడికి పాల్పడింది. డ్నిప్రో నుంచి జపోరిజ్జియా నగరానికి వెళ్లాల్సిన రైలు నంబర్ 866 అప్పటికి ప్లాట్‌ఫామ్‌పై ఉంది. ఆ ప్లాట్‌ఫామ్‌నే డ్రోన్ లక్ష్యంగా చేసుకుంది. రైల్వే స్టేషన్ పరిసరాల్లో ప్రమాద ముప్పు అధికంగా ఉందని ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, అక్కడ ప్రయాణికులు ఉన్నారని రైల్వే సంస్థ తెలిపింది. దాడి జరిగిన వెంటనే అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌పై జరిగిన దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని అమెరికా, యూరప్ దేశాలు, జీ7 కూటమిని కోరారు. "డ్నిప్రో రైల్వే స్టేషన్‌పై రష్యా భయంకరమైన దాడి చేసింది. సాధారణ ప్రయాణికుల రైలు, షెడ్యూల్ ప్రకారం నడిచే మరో ప్రయాణికుల రైలు నిలిచి ఉన్న ప్లాట్‌ఫామ్‌పై రష్యన్లు డ్రోన్‌తో దాడి చేశారు. దురదృష్టవశాత్తూ ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు నిర్ధారించాం. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. మరో 10 మంది గాయపడ్డారు. అవసరమైన అత్యవసర సేవలన్నీ ఘటనా స్థలంలో పనిచేస్తున్నాయి" అని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. యుద్ధం కొనసాగుతున్నంతకాలం మాస్కోపై ఆంక్షలను సడలించకూడదని, కొత్తగా మరింత కఠినమైన ఆంక్షలు విధించాలని కోరారు.

నవంబర్ 1 నుంచి జరిగే మార్పులివే..



నవంబర్ ప్రారంభం కానుండటంతో సామాన్యులు, పెన్షనర్లు, పన్ను చెల్లింపుదారులు కొన్ని ముఖ్యమైన ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. నవంబర్ 1 నుంచి జీఎస్టీ నిబంధనల్లో మార్పులు అమల్లోకి రానుండగా, పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆడిట్ వర్తించే కొందరు పన్ను చెల్లింపుదారులకు ఐటీఆర్ దాఖలు గడువు కూడా పొడిగించారు. ఎల్‌పీజీ సిలిండర్ల ధరలపై నెలవారీ సమీక్ష జరగనుంది.

జీఎస్టీ నిబంధనల్లో మార్పులు: నవంబర్ 1 నుంచి జీఎస్టీకి సంబంధించిన కొన్ని నిబంధనలు మారనున్నాయి. విక్రయం తర్వాత ఇచ్చే డిస్కౌంట్లకు సంబంధించిన నిబంధనలను సులభతరం చేయడం, ఇన్‌వర్టెడ్ డ్యూటీ నిర్మాణం కారణంగా రిఫండ్ కోసం ఎదురుచూస్తున్న వ్యాపారాలకు తాత్కాలిక రిఫండ్‌లను వేగంగా అందించడం ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం. ఈ నిర్ణయాలతో వ్యాపారాలకు పన్ను సంబంధిత ప్రక్రియలు మరింత సులభమయ్యే అవకాశం ఉంది.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ ముఖ్యం: ప్రభుత్వ పెన్షన్ పొందుతున్నవారు తమ పెన్షన్ నిరంతరాయంగా అందాలంటే ప్రతి సంవత్సరం లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి. 80 ఏళ్లలోపు వయసున్న అర్హులైన పెన్షనర్లు నవంబర్ 1 నుంచి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. 80 ఏళ్లు నిండినవారికి అక్టోబర్ 1 నుంచే అవకాశం కల్పించారు. సాధారణంగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు నవంబర్ 30 చివరి తేదీ. గడువులోగా సమర్పించకపోతే పెన్షన్ చెల్లింపుల్లో తాత్కాలిక అంతరాయం ఏర్పడవచ్చు.

ఐటీఆర్ గడువు పొడిగింపు: 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీఆర్ దాఖలులో, ఆడిట్ తప్పనిసరైన నిర్దిష్ట వర్గాల పన్ను చెల్లింపుదారులకు ఊరట లభించింది. అసెస్‌మెంట్ ఇయర్ 2026–27కు సంబంధించిన రిటర్నుల గడువును అక్టోబర్ 31 నుంచి 2026 నవంబర్ 21 వరకు పొడిగించారు. ఈ వెసులుబాటు అందరు పన్ను చెల్లింపుదారులకు వర్తించదు. కాబట్టి తమకు వర్తించే గడువును పన్ను చెల్లింపుదారులు నిర్ధారించుకోవాలి.

ఎల్‌పీజీ ధరలపై ఉత్కంఠ: చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రతి నెలా మొదటి తేదీన ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను సమీక్షిస్తాయి. దీంతో నవంబర్ 1న గృహ అవసరాల సిలిండర్లు, వాణిజ్య సిలిండర్ల ధరల్లో మార్పులు ఉంటాయా అనే ఆసక్తి నెలకొంది. అయితే అక్టోబర్ 29 నాటికి నవంబర్ 1 ధరల మార్పుపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ధరలు పెరుగుతాయా? తగ్గుతాయా? అనేది అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే స్పష్టమవుతుంది.

దివ్యాంగుల పెన్షన్‌పై లేని క్లారిటీ:

దివ్యాంగుల పెన్షన్ అర్హతలు, కేంద్ర సాయం పెంపునకు సంబంధించిన సంస్కరణలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినప్పటికీ, వాటి అమలుకు సంబంధించిన కొత్త మార్గదర్శకాలు ఇంకా విడుదల కాలేదు. అందువల్ల ఈ మార్పులు నవంబర్ 1 నుంచే అమల్లోకి వస్తాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అధికారిక మార్గదర్శకాలు వచ్చే వరకు లబ్ధిదారులు వేచి చూడాల్సి ఉంటుంది.





నేడు 18 సినిమాలు స్ట్రీమింగ్

ఈ ఫ్రైడే ఓటీటీ మూవీస్..

నెట్‌ఫ్లిక్స్

అవరచన్ & బాయ్స్ (తెలుగు డబ్బింగ్) – అక్టోబర్ 30
ఎస్ఐ యుగంధర్ (తెలుగు మూవీ) – అక్టోబర్ 30
అక్క (తెలుగు డబ్బింగ్ సిరీస్) – అక్టోబర్ 30
సిగ్మా (తెలుగు డబ్బింగ్ సినిమా) – అక్టోబర్ 30
హౌ టూ రూయిన్ దివాళి:
మీట్ ద పేరెంట్స్ (సౌతాఫ్రికన్ సిరీస్) – అక్టోబర్ 30
ఏ కపుల్ ఆఫ్ లైస్ (స్వీడిష్ సిరీస్) – అక్టోబర్ 30
కొలిజన్ కోర్స్ (స్పానిష్ మూవీ) – అక్టోబర్ 30
డెడ్ ఎండ్ జాబ్ (కొరియన్ సిరీస్) – అక్టోబర్ 30
మీథే మే క్యాన్ హై (హిందీ సిరీస్) – అక్టోబర్ 30
అబ్సెన్ (అరబ్ సిరీస్) – అక్టోబర్ 30
ఎస్‌సీటీవీ: ద గ్రేట్ షో యూ నెవర్ హెర్డ్ ఆఫ్ (కెనడియన్ షో) – అక్టోబర్ 30

జియో హాట్‌స్టార్

లవ్ ఆల్వేస్ (తెలుగు డబ్బింగ్ సిరీస్) – అక్టోబర్ 30
అబ్సెసన్: ద ఒరిజినల్ అన్ కట్ వెర్షన్ – అక్టోబర్ 30

అమెజాన్ ప్రైమ్

అపోకలిప్స్ జెడ్: న్యూ వరల్డ్ (ఇంగ్లీష్) – అక్టోబర్ 30
ది డార్క్ హెవెన్(తమిళ సినిమా)– అక్టోబర్ 30

సోనీ లివ్

ఇమ్మోర్టల్ (తెలుగు డబ్బింగ్ సినిమా) – అక్టోబర్ 30

జీ5

రుద్రవనం పీఎస్ (తెలుగు సిరీస్) – అక్టోబర్ 30

ఈ శుక్రవారం దీపావళి కంటే ముందుగానే పెద్ద సినిమాలు బాక్సాఫీస్ వద్ద సందడి చేయనున్నాయి. ఈ ఫ్రైడే వెంకీమామ ఆదర్శ కుటుంబం, విశ్వక్ సేన్ కల్ట్‌తో పాటు మరో మూవీ కిల్లర్ థియేటర్లలో అలరించనుంది. వీటిలో ఆదర్శ కుటుంబంపై ఆడియన్స్‌లో బజ్ నెలకొంది. కల్ట్ కోసం కూడా మాస్ ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. మరి ఈ మూడింటిలో ఏది హిట్ అవుతుందో ఈ శుక్రవారం తేలిపోనుంది. ఇక ఓటీటీల విషయానికొస్తే పలు హిట్ సినిమాలు సందడి చేయనున్నాయి. టాలీవుడ్ మూవీ ఎస్ఐ యుగంధర్‌తో పాటు సందీప్ కిషన్ సిగ్మా ఓటీటీకి రానుంది. కీర్తి సురేశ్ నటించిన మరో చిత్రం అక్క నేరుగా ఓటీటీలోనే స్ట్రీమింగ్ కానుంది. వీటితో పాటు ది డార్క్ హెవెన్ లాంటి క్రైమ్ థ్రిల్లర్ సినిమాలు కూడా రానున్నాయి. అవరచన్ అండ్ బాయ్స్, ఇమ్మోర్టల్ లాంటి డబ్బింగ్ మూవీస్, రుద్రవనం పీఎస్ అనే తెలుగు సిరీస్ ఆసక్తి పెంచేస్తున్నాయి. వీటితో పాటు బాలీవుడ్, హాలీవుడ్ నుంచి పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి. మరి ఏయే మూవీ ఎక్కడ స్ట్రీమింగ్ కానుందో మీరు కూడా ఓ లుక్కేయండి.

దర్శకుడిగా రాహుల్ రామకృష్ణ

'అర్జున్ రెడ్డి', 'జాతిరత్నాలు' వంటి చిత్రాలతో తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించిన విలక్షణ నటుడు రాహుల్ రామకృష్ణ త్వరలో మెగాఫోన్ పట్టబోతున్నారు. నటుడిగా మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, దర్శకత్వంపై దృష్టి సారించినట్టు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'హుషారు-2' సినిమా పూర్తయిన వెంటనే దర్శకత్వ బాధ్యతలు చేపడతానని వెల్లడించారు. వచ్చే ఏడాది తన దర్శకత్వంలో సినిమా ఉండొచ్చని రాహుల్ సూచనప్రాయంగా తెలిపారు. ఇది



పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని, ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే తానే రాసుకున్నానని చెప్పారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్ట్ కోసం నటీనటుల ఎంపిక కూడా పూర్తయిందని, త్వరలోనే షూటింగ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వివరాలను త్వరలో వెల్లడిస్తామని అన్నారు. కెరీర్ ప్రారంభం నుంచి ఎక్కువగా హీరో ఫ్రెండ్ పాత్రలే రావడం, అవే పాత్రలు పదేపదే చేయాల్సి రావడంతో విసుగు చెందానని, అందుకే దర్శకత్వం వైపు అడుగులు వేస్తున్నానని రాహుల్ వివరించారు. ప్రస్తుతం శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో 'హుషారు-2'లో నటిస్తున్న రాహుల్, దర్శకుడిగా ఎలాంటి వినోదాన్ని పంచుతారో అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆర్జీవీకి రూ.30 కోట్ల లీగల్ నోటీసులు



డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ చిక్కుల్లో పడ్డారు. పాత బకాయిల విషయంలో ఓ బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈ అగ్ర దర్శకుడికి లీగల్ నోటీసులు ఇచ్చింది. రామ్‌గోపాల్ వర్మ తమకు 29 కోట్ల 67 లక్షలు బకాయిలు ఉన్నాడని, ఇందులో 11 కోట్ల 38 లక్షల వడ్డీ కూడా కలిపి ఉందని ఎక్లాటెంట్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ బహిరంగ నోటీసు జారీ చేసింది. అక్టోబర్ 30 లోపు తమకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలను క్లియర్ చేయాలని ఈ నోటీసులో పేర్కొన్నది. 2010లో ఆర్‌జీవీతో తాము ఓ ఆర్థిక ఒప్పందం చేసుకున్నామని, కానీ దానిని ఉల్లంఘించారని తెలిపింది. ఈ వివాదానికి సంబంధించి 2013లో ముంబై హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని ఎక్లాటెంట్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చెప్పింది. ఆర్‌జీవీతో ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాలు చేసుకునే నిర్మాతలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు తమ నుంచి తప్పనిసరిగా ఎన్‌వోసీ తీసుకోవాల్సిందేనని ఎక్లాటెంట్ సంస్థ తెలిపింది. ఈ లీగల్ నోటీసుల ప్రభావం ఆర్‌జీవీ లేటెస్ట్ మూవీ పోలీస్ కంపెనీపై పడే అవకాశం ఉందని అంటున్నారు. ముంబాయి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ దయానాయక్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో హర్షవర్ధన్ రాణే కీలక పాత్రలో కనిపించబోతున్నారు. టీ సిరీస్ సంస్థతో కలిసి ఆర్‌జీవీ స్వయంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ప్రాణం పణంగా పెట్టా



నటి రెజీనా కసాండ్రా తన సినీ కెరీర్‌లో తొలిసారిగా ఒక పూర్తిస్థాయి కమర్షియల్ విలన్‌గా నటిస్తున్నట్లు తెలిపారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన 'మూకుత్తి అమ్మన్ 2' చిత్రంలో తాను పోషించిన 'భైరవి' అనే పవర్‌ఫుల్ నెగెటివ్ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించానని ఆమె అన్నారు. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న రెజీనా పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ సి పై రెజీనా ప్రశంసలు కురిపించారు. "గత 30 ఏళ్లుగా తమిళ చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఇతర పరిశ్రమలకు వెళ్లకుండానే తమిళ సినిమాను పాన్-ఇండియా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి సుందర్ సి. అలాంటి దర్శకుడి సినిమాలో ఇంత బలమైన విలన్ పాత్ర లభించడం సంతోషంగా ఉంది. ఇందులో నయనతారతో నా ఫైట్ సీన్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి" అని ధీమా వ్యక్తం చేశారు. 2020లో ఘన విజయం సాధించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ సినిమా రాబోతోంది. సుందర్ సి దర్శకత్వం వహించిన ఈ డివోషనల్ కామెడీ చిత్రాన్ని ఇషారి కె. గణేశ్ నిర్మించారు. ఇందులో నయనతార, ఖుష్బూ, స్నేహ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సినిమా పూజ నుంచి ప్రీ-రిలీజ్ ఈవెంట్ వరకు ప్రతీది ఎంతో గ్రాండ్‌గా నిర్వహించిన నిర్మాత ఇషారి కె. గణేశ్‌కు రెజీనా ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి భారీ బడ్జెట్ మహిళా ప్రాధాన్య చిత్రాలు నిర్మించడం తనలాంటి ఎందరో నటీమణులకు కొత్త ఆశను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని, కథను నమ్మి ముందుకొచ్చే నిర్మాతలకు అందరూ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

'మిల్కీ బ్యూటీ' సంచలన వ్యాఖ్యలు



విద్యార్థుల కోసం ధనుష్ ఫ్రీ ఏసీ ట్యూషన్స్



ప్రముఖ నటుడు ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు మరింత బలపడుతున్నాయి. ఇప్పటికే ఆయన తన అభిమాన సంఘాల ద్వారా ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను చేపట్టారు. తాజాగా, తన సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ ఆయన తీసుకున్న ఓ కీలక నిర్ణయం ఇప్పుడు తమిళనాట చర్చనీయాంశంగా మారింది. తన 'ధనుష్ నార్పని ఇయక్కం' (ధనుష్ సంక్షేమ ఉద్యమం) సంస్థ ద్వారా రాష్ట్రంలోని పేద విద్యార్థుల కోసం ఉచితంగా ఏసీ ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. 2027 జనవరి నుంచి ఈ పథకాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లోనూ 10, 12వ తరగతి విద్యార్థుల కోసం 'స్మార్ట్ స్టడీ హబ్స్' పేరిట ఈ ఏసీ ట్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు.

సీనియర్ నటుడు అన్నూ కపూర్ గతంలో తన శరీరాకృతిపై చేసిన 'దూధియా బదన్' (పాల వంటి శరీరం) వ్యాఖ్యలపై నటి తమన్నా భాటియా తొలిసారి స్పందించారు. ఇలాంటి ప్రతికూల విషయాలను తాను పట్టించుకోనని, వాటిని వడపోసి తన పనిపైనే దృష్టి సారిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు చేసిన ఏడాది తర్వాత ఆమె ఈ వివాదంపై మౌనం వీడారు. తాజాగా ఎన్డీటీవీ ప్రాఫిట్ ఇగ్నైట్ 2026 కార్యక్రమంలో పాల్గొన్న తమన్నాను ఈ విషయంపై ప్రశ్నించగా, ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "ఒక సృజనాత్మక వ్యక్తిగా మనం వినడం చాలా ముఖ్యం. విన్నవాటిలో దేన్ని ఉంచుకోవాలి, దేన్ని వదిలేయాలి అనేది అర్థం చేసుకోవాలి. ఒక మహిళగా మీరు కూడా అర్థం చేసుకోగలరు.. మనం ఇలాంటి వాటికి ప్రాధాన్యత ఇస్తూ పోతే జీవితంలో ముందుకు సాగలేకపోవచ్చు" అని తమన్నా హుందాగా సమాధానమిచ్చారు. తాను అలాంటి వ్యాఖ్యలను అసలు పట్టించుకోనని, తన నటన, కెరీర్‌కే మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. "నేను నా పనిపైనే దృష్టి పెడతాను. నేను ఏం చేయాలనుకుంటున్నానో దానిపైనే ఫోకస్ చేస్తాను" అని అన్నారు. నటనను కేవలం కెరీర్‌గా కాకుండా ఒక సేవగా భావిస్తానని, అందుకే తన పని ప్రేక్షకులకు బాగా చేరువవుతుందని ఆమె వివరించారు. 2025లో 'స్త్రీ 2' చిత్రంలోని 'ఆజ్ కీ రాత్' పాటలో తమన్నా నటనను చూసిన అన్నూ కపూర్, ఆమె 'పాల వంటి ముఖం, శరీరం' పిల్లలు హాయిగా నిద్రపోవడానికి సాయపడతాయని, ఇది దేశానికి ఒక వరం లాంటిదని వ్యాఖ్యానించారు.



హాకీలో భారత్‌పై చైనా చిత్తు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన గ్రూపు మ్యాచ్‌లో చైనాను 5-2 తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో మొదటి నుంచి చివరి వరకూ భారత్‌దే ఆధిపత్యం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ చెరో రెండు గోల్స్‌తో సత్తాచాటి ఇండియా గెలుపులో కీలక పాత్ర పోషించారు. 12వ నిమిషంలో సుఖ్‌జీత్ చేసిన గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. అయితే, 26వ నిమిషంలో చైనా ప్లేయర్ యాంగ్ గోల్ చేయడంతో స్కోరు 1-1తో సమమైంది. అనంతరం భారత్ దూకుడు పెంచింది. హర్మన్‌ప్రీత్ వరుసగా 27వ నిమిషంలో, 31వ నిమిషంలో రెండు గోల్స్ చేశాడు. కాసేపటికే సుఖ్‌జీత్ మరో గోల్ చేశాడు. దీంతో భారత్ 4-1తో ఆధిక్యంలోకి వెళ్లి మ్యాచ్‌పై పట్టు సాధించింది. 36వ నిమిషంలో చైనా రెండో గోల్ చేసింది. ఆ జట్టుకు అదే చివరి గోల్. అనంతరం ప్రత్యర్థికి భారత్ పూర్తిగా కళ్లెం వేసింది. మరో గోల్ చేయకుండా అడ్డుకుంది. ఇండియాను చైనా నిలువరించలేక చేతులెత్తేసింది. 47వ నిమిషంలో జుగ్‌రాజ్ సింగ్ చేసిన గోల్ భారత్ ఆధిక్యం 5-2కు చేరగా.. చివరి వరకూ ఆధిపత్యం ప్రదర్శించి విజయం సాధించింది. నేడు జపాన్‌తో ఇండియా తలపడనుంది.



మనీషాకు 'గోల్డెన్' చాన్స్

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ మనీషా భాన్వాలా అద్భుత ప్రదర్శనతో 59 కేజీల ఫైనల్‌కు చేరుకోగా, తను శర్మ 72 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గురువారం జరిగిన సెమీ ఫైనల్లో మంగోలియాకు చెందిన బోలోర్టుయా ఖురెల్ఖూను ఓడించిన మనీషా కనీసం రజత పతకాన్ని ఖాయం చేసింది. ఇక బ్రాంజ్ మెడల్ ప్లే ఆఫ్ పోరులో తను శర్మ 9-5తో అమెరికాకు చెందిన ప్రెషియస్ రోసన్నా బెల్‌పై గెలిచింది. కాగా, 55 కేజీల విభాగంలో అహల్యా షిండే క్వార్టర్‌ఫైనల్లోనే ఓడి ఇంటిదారి పట్టగా.. పురుషుల ఫ్రీస్టయిల్ 97 కేజీల విభాగంలో వికీ హూడా కూడా క్వార్టర్ ఫైనల్లోనే ఓడినా తన ప్రత్యర్థి ఫైనల్‌కు చేరడంతో వికీ రిపిఛేజ్ రౌండ్‌కు అర్హత సాధించాడు. 65 కేజీల విభాగంలో సుజీత్ కల్కల్ క్వార్టర్స్‌లో ఓడి ఇంటిదారి పట్టాడు.

ముంబై ఇండియన్స్.. రిచెస్ట్

ప్రపంచ క్రీడా యవనికపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. తాజాగా స్పోర్టికో నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ (ఎంఐ) ఫ్రాంచైజీ 2.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 20,008 కోట్లు) అద్భుతమైన విలువతో ప్రపంచంలోనే అత్యంత విలువైన ఐపీఎల్ జట్టుగా అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదిక ప్రకారం.. ఐపీఎల్‌లోని ప్రతి ఫ్రాంచైజీ విలువ ఇప్పుడు కనీసం 1.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 14,292 కోట్లు) మార్కును దాటడం విశేషం. విలువ పరంగా ముంబై ఇండియన్స్ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 1.85 బిలియన్ డాలర్లతో (రూ. 17,626 కోట్లు) రెండో స్థానంలో, చెన్నై సూపర్ కింగ్స్ 1.75 బిలియన్ డాలర్లతో (రూ. 16,674 కోట్లు) మూడో స్థానంలో నిలిచాయి. కోల్‌కతా నైట్ రైడర్స్ 1.73 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో ఉండగా, ఢిల్లీ క్యాపిటల్స్ 1.7 బిలియన్ డాలర్లతో లీగ్ సగటు విలువకు సమానంగా ఉంది. మిగతా జట్లలో రాజస్థాన్ రాయల్స్ (1.65 బిలియన్ డాలర్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1.62 బిలియన్ డాలర్లు), గుజరాత్ టైటాన్స్ (1.58 బిలియన్ డాలర్లు), పంజాబ్ కింగ్స్ (1.53 బిలియన్ డాలర్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



4-0పై టీమిండియా గురి

న్యూజిలాండ్ గడ్డపై భారత క్రికెట్ జట్టు మరో విజయానికి సిద్ధమైంది. ఇప్పటికే ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న టీమిండియా.. శుక్రవారం ఆక్లాండ్‌లో జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి ఆధిక్యాన్ని 4-0కు పెంచాలని పట్టుదలగా ఉంది. మరోవైపు వరుస పరాజయాలతో సతమతమవుతున్న న్యూజిలాండ్.. సత్తా చాటాలని చూస్తోంది.



కుల్దీప్, వరుణ్‌కు చాన్స్?.. ఆక్లాండ్‌లో నాలుగో టీ20



ఈ మ్యాచ్‌లో భారత్ గెలుపుతో పాటు జట్టులోని రిజర్వ్ ఆటగాళ్లకు అవకాశాలు దక్కుతాయా? అనే ఆసక్తి కూడా నెలకొంది. సిరీస్ ఇప్పటికే భారత్ చేతిలోకి రావడంతో తుది జట్టులో ప్రయోగాలు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తికి అవకాశం కల్పించే అంశాన్ని టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలించవచ్చు. బ్యాటింగ్‌ను ఎనిమిదో స్థానం వరకు బలోపేతం చేస్తూ భారత్ ఆడుతున్న విధానం ఇప్పటివరకు మంచి ఫలితాలనే ఇచ్చింది. అయితే నాలుగో టీ20లో అక్షర్ పటేల్ లేదా అద్భుత ఫామ్‌లో ఉన్న నమన్ ధీర్‌కు విశ్రాంతినిస్తే.. కుల్దీప్ లేదా వరుణ్ తుది జట్టులోకి వచ్చే అవకాశముంది.

న్యూజిలాండ్‌పై కుల్దీప్ రికార్డు కూడా అతడికి అనుకూలంగా ఉంది. ముఖ్యంగా గ్లెన్ ఫిలిప్స్‌ను ఐదు ఇన్నింగ్స్‌ల్లో నాలుగుసార్లు అవుట్ చేశాడు. అక్షర్ కూడా ఫిలిప్స్‌ను ఐదుసార్లు పెవిలియన్‌కు పంపాడు. దీంతో భారత స్పిన్నర్ల ఎంపిక ఈ మ్యాచ్‌లో ఆసక్తికరంగా మారింది. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ విధ్వంసకర ఫామ్‌లో ఉన్నాడు. వెల్లింగ్టన్‌లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించి న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అంతర్జాతీయ టీ20ల్లో అతడికిది నాలుగో సెంచరీ. టీ20 క్రికెట్లో అతడికి 11వ శతకం కాగా, భారత బ్యాటర్లలో టీ20ల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. 2025 నుంచి టీ20ల్లో అభిషేక్ 200.6 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధిస్తుండటం అతడి దూకుడుకు నిదర్శనం. న్యూజిలాండ్ బౌలర్లు జాకబ్ డఫీ, కైల్ జేమీసన్‌పై కూడా అతడు భారీ స్ట్రైక్‌రేట్లతో పరుగులు చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ గాయం నుంచి కోలుకోకపోతే వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కవచ్చు. అభిషేక్‌తో కలిసి అతడు ఎలా ఆడతాడన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది.

గాయాలతో న్యూజిలాండ్‌కు కష్టాలు

భారత్‌ను నిలువరించడంలో న్యూజిలాండ్ బౌలర్లు విఫలమవుతున్నారు. ఇప్పటికే హెన్రీ అందుబాటులో లేకపోగా, కాలి కండరాల గాయంతో లాకీ ఫెర్గూసన్ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. వెల్లింగ్టన్‌లో పవర్‌ప్లేలోనే భారత్ రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించడం కివీస్ బౌలింగ్ వైఫల్యాన్ని స్పష్టం చేసింది. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ బంతితో రాణిస్తున్నా.. మిగతా బౌలర్ల నుంచి తగిన సహకారం లభించడం లేదు. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ బ్యాటర్లకు అనుకూలంగా ఉండటంతో భారత బ్యాటింగ్‌ను కట్టడి చేయడం కివీస్‌కు పెద్ద సవాలే.

ఈ మ్యాచ్‌కు దాదాపు 40 వేల మంది ప్రేక్షకులు హాజరవుతారని అంచనా. న్యూజిలాండ్‌లో ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌కు ఇదే అత్యధిక ప్రేక్షకుల హాజరుగా నిలిచే అవకాశం ఉంది. 2019లో ఇదే వేదికపై భారత్ పురుషుల, మహిళల జట్ల మ్యాచ్‌లకు కలిపి నమోదైన 36,523 మంది హాజరు రికార్డును ఈసారి అధిగమించే అవకాశం ఉంది. టీ20ల్లో న్యూజిలాండ్‌పై భారత్ ఇప్పటివరకు 34 మ్యాచ్‌లు ఆడగా 22 విజయాలు సాధించింది. కివీస్‌పై వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత్.. ఈ మ్యాచ్‌లోనూ గెలిస్తే తమ ఆధిపత్యాన్ని మరింత పెంచుకుంటుంది.

మలింగపై ముంబై వేటు



వచ్చే ఐపీఎల్ సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ స్టాఫ్‌లో ప్రక్షాళన చేపట్టింది. ఇటీవలే మహేల జయవర్దెనేతో సుదీర్ఘ బంధానికి తెరదించిన ఎంఐ తమ కొత్త హెడ్ కోచ్‌గా కీరన్ పొలార్డ్‌ను నియమించిన విషయం తెలిసిందే. తాజాగా ఫ్రాంచైజీ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. బౌలింగ్ కోచ్‌లు లసిత్ మలింగ, పరాస్ మ్హాంబ్రే, ఫీల్డింగ్ కోచ్ కార్ల్ హాప్కిన్సన్‌లకు కూడా వీడ్కోలు పలికింది. ఎంఐతో మలింగకు కూడా సుదీర్ఘ అనుబంధం ఉంది. 2008-17 వరకు, ఆ తర్వాత 2019-20 వరకు ఎంఐకి ప్రాతినిధ్యం వహించాడు. నాలుగు ఐపీఎల్ టైటిల్స్ గెలిచిన జట్లలో మలింగ సభ్యుడు. అనంతరం ముంబైకి మెంటార్‌గా, బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. మరోవైపు, మ్హాంబ్రే 2024లో ముంబై బౌలింగ్ కోచ్‌గా చేరాడు. రెండు సీజన్లపాటు సేవలందించాడు. ఇక హాప్కిన్సన్ 2025 సీజన్‌కు ముందు జట్టులో చేరాడు. కోచింగ్ స్టాఫ్‌లో ప్రక్షాళన చేపట్టిన ముంబై ప్రధాన కోచ్ పొలార్డ్ నేతృత్వంలో కొత్త సిబ్బందిని నియమించనుంది. ఐపీఎల్-2027 మినీ వేలానికి ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. కొంతకాలంగా ముంబై ఇండియన్స్ అంచనాలను అందుకోలేకపోతుంది. ఆ జట్టు చివరిసారిగా 2020లో టైటిల్ గెలిచింది. ఆ తర్వాతి రెండు సార్లు(2023, 2025) మాత్రమే ప్లే ఆఫ్స్‌కు చేరుకుంది. ఈ ఏడాది 9వ స్థానంతో సరిపెట్టింది. జట్టు పేలవ ప్రదర్శన నేపథ్యంలోనే కోచింగ్ స్టాఫ్‌ను మార్చాలని ఫ్రాంచైజీ భావించినట్టు అర్థమవుతుంది.

ఖేలో ఇండియా గేమ్స్‌కు ప్రధానికి ఆహ్వానం!



తెలంగాణ ఆతిథ్యం ఇచ్చే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. డిసెంబర్‌లో జరిగే ఖేలో గేమ్స్ సన్నద్ధత, నిర్వహణ ఏర్పాట్లపై న్యూఢిల్లీలో మాండవీయతో వాకిటి శ్రీహరి నేతృత్వంలోని రాష్ట్ర బృందం గురువారం సమావేశమైంది. ఈ సందర్భంగా పోటీలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, క్రీడాకారులకు అత్యుత్తమ సదుపాయాలు, వసతి, రవాణా, భద్రత కల్పించాలని మాండవీయ సూచించారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ హాజరైతే ఈ పోటీలకు జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యత లభించడంతో పాటు యువ క్రీడాకారుల్లో ఉత్తేజం నిండుతుందన్నారు.

పంజాబ్- హైదరాబాద్ మ్యాచ్ డ్రా



రంజీ తాజా సీజన్‌లో హ్యాట్రిక్ కొట్టాలన్న హైదరాబాద్ జట్టుకు నిరాశే ఎదురైంది. సొంతగడ్డపై పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌ను ఆ జట్టు డ్రాతో ముగించింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై పంజాబ్ బ్యాటర్లు తొలి ఇన్నింగ్స్ మాదిరిగానే చెలరేగి తమ జట్టును మెరుగైన స్థితిలో నిలిపారు.ఓవర్‌నైట్ స్కోరు 57/0తో గురువారం క్రీజులోకి వచ్చిన పంజాబ్.. మాచ్ చివరి రోజు 240/6 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (68), కెప్టెన్ ఉదయ్ సహరన్ (55 నాటౌట్), విహాన్ మల్హోత్ర (53) అర్ధశతకాలతో రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రక్షణ రెడ్డి (2/16), తనయ్ త్యాగరాజన్ (2/51) తలా రెండు వికెట్లు పడగొట్టారు. మ్యాచ్ డ్రా అవగా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో పంజాబ్ మూడు పాయింట్లు అందుకోగా.. హైదరాబాద్‌కు ఒకే పాయింట్ దక్కింది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 30-10-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

రాదనుకున్న కరువు వచ్చేసింది

కరువు ముంచుకొస్తున్న సంకేతాలు కనిపిస్తున్నప్పుడు ముందస్తు చర్యలు తీసుకోకపోతే మాత్రం దాని దెబ్బకు సమాజం విలవిలలాడక తప్పదు. ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తున్న పరిస్థితి ఇదే. చూడొద్దనుకున్న కరువు వచ్చేసింది. వర్షాభావం, ఎండల తీవ్రత, అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఎండిపోతున్న పంటలు, తాగునీటి కోసం ప్రజల పాట్లు.. వెరసి రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇది కేవలం ప్రకృతి విపత్తు మాత్రమే కాదు.. ముందస్తు ప్రణాళికలు, నీటి నిర్వహణ, వ్యవసాయ విధానాల సమర్థతకు ఎదురైన పరీక్ష కూడా! తెలంగాణ వ్యవసాయం ప్రధానంగా వర్షాలపైనే ఆధారపడి ఉంది. వానలు సకాలంలో కురిస్తే చెరువులు నిండుతాయి. బావులు, బోర్లు జీవం పోసుకుంటాయి. పంటలు పచ్చబడతాయి. రైతుల ఇళ్లలో సంతోషం వెల్లివిరుస్తుంది. అదే వానలు ముఖం చాటేస్తే పరిస్థితి తలకిందులవుతుంది. సాగు పెట్టుబడులు భారమవుతాయి. పశువులకు మేత కరువవుతుంది. గ్రామాల్లో ఉపాధి తగ్గుతుంది. తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న ఆందోళనకు ఇదే మూలం. కరువు ఒక్కరోజులో పుట్టుకొచ్చేది కాదు. వర్షపాతం తగ్గడం, జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోవడం, చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం.. ఇవన్నీ ముందస్తు హెచ్చరికలే. వాటిని గుర్తించి అప్రమత్తం కావాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంటుంది. వర్షాలు తగ్గినప్పుడే ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు సూచనలు ఇవ్వాలి. సాగునీటి లభ్యతను అంచనా వేసి పంటల ప్రణాళికను రూపొందించాలి. తాగునీటి అవసరాలను ముందుగానే లెక్కించాలి. పశువులకు మేత కొరత రాకుండా చర్యలు చేపట్టాలి. ఈ ఏర్పాట్లలో ఎక్కడ లోటు జరిగినా చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలే. ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. వేసవికి ముందే నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తే, రాబోయే రోజులను మరింత తీవ్రంగా పరిగణించాల్సిందే. పట్టణాల్లో నీటి ట్యాంకర్లపై ఆధారపడే కుటుంబాల సంఖ్య పెరిగితే, గ్రామాల్లో బిందెడు నీటి కోసం దూరం వెళ్లాల్సి వస్తే అది సాధారణ సమస్య కాదు. నీరు మనిషి ప్రాథమిక అవసరం. దాన్ని అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. తాగునీటికి ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించాలి. నీటి పంపిణీలో అక్రమాలు, వృథా, నిర్లక్ష్యానికి తావుండకూడదు. హైదరాబాద్ వంటి మహానగరంలో నీటి అవసరాలు నానాటికీ పెరుగుతున్నాయి. జనాభా విస్తరణ, నిర్మాణ రంగం, పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలతో నీటిపై ఒత్తిడి అధికమవుతోంది. ఇలాంటి సమయంలో వర్షాభావం తోడైతే సమస్య మరింత జటిలమవుతుంది. నగరానికి నీటిని అందించే వనరుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలి. వర్షపు నీటిని ఒడిసిపట్టే ఏర్పాట్లను బలోపేతం చేయాలి. చెరువులు, కుంటలను కాపాడాలి. భవనాల్లో వర్షపు నీటి నిల్వను ప్రోత్సహించాలి. భూగర్భ జలాల వినియోగంపై నియంత్రణ ఉండాలి. నీటి సమస్య తలెత్తిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందే మేల్కొనడం మేలు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావం మరింత తీవ్రమైనది. పంటలు ఎండిపోతే రైతు పెట్టిన పెట్టుబడి మట్టిపాలవుతుంది. అప్పులు పెరుగుతాయి. పంట చేతికందకపోతే కుటుంబ అవసరాలు తీర్చుకోవడమే కష్టమవుతుంది. పశుపోషణపై ఆధారపడినవారికి మేత, నీటి కొరత అదనపు భారంగా మారుతుంది. కాబట్టి పంట నష్టాలపై క్షేత్రస్థాయిలో అంచనాలు నిర్వహించి, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలి. అవసరమైన చోట ఉపాధి పనులు కల్పించాలి. పశువులకు మేత శిబిరాలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలి. రైతులను ఆదుకునే చర్యలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో లేదో పరిశీలించాలి. కరువు వేళ రాజకీయాలకు తావుండకూడదు. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం కంటే ప్రజలకు ఏం చేయగలమన్నదానిపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వానికి సమస్యలను వివరించడం, లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యతే. అదే సమయంలో పరిష్కారాల కోసం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. పాలకులు కూడా విమర్శలను రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజల దాహం రాజకీయ పార్టీల రంగులను చూడదు. రైతు కష్టం అధికార, ప్రతిపక్షాల తేడాలను గుర్తించదు. కరువు అందరినీ ఒకేలా దెబ్బతీస్తుంది. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా నివారించడం మనిషి చేతుల్లో లేకపోవచ్చు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడం మాత్రం సాధ్యమే. తెలంగాణలో నీటి సంరక్షణకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. వర్షపు నీటిని నిల్వ చేయడం, చెరువులను పునరుద్ధరించడం, కాలువల నిర్వహణ, భూగర్భ జలాల పెంపు, సూక్ష్మ సేద్య పద్ధతుల ప్రోత్సాహం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ ప్రాంతంలో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎంత అవసరం ఉంది? రాబోయే నెలల్లో పరిస్థితి ఎలా ఉండొచ్చు? అనే అంశాలపై శాస్త్రీయ అంచనాలతో కార్యాచరణ రూపొందించాలి. స్థానిక సంస్థలను భాగస్వాములను చేసి, ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కల్పించాలి. ఇప్పుడు కావాల్సింది సమీక్షలతో సరిపెట్టడం కాదు.. సమర్థవంతమైన కార్యాచరణ. ప్రకటనలతో ప్రజల దాహం తీరదు. హామీలతో ఎండిన పంటలు పచ్చబడవు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అర్థం చేసుకుని, సమస్య తీవ్రతకు తగిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ పనితీరుకు సార్థకత ఉంటుంది. అధికారులు గ్రామాలను సందర్శించాలి. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించాలి. ట్యాంకర్ల సరఫరాలో పారదర్శకత పాటించాలి. అత్యవసర నిధులను అందుబాటులో ఉంచాలి. పరిస్థితి మరింత దిగజారకముందే అవసరమైన చర్యలు చేపట్టాలి. చూడొద్దనుకున్న కరువు వచ్చేసింది. ఇప్పుడు దాన్ని చూసీచూడనట్లు వదిలేయడం మాత్రం క్షమించరాని నిర్లక్ష్యమే అవుతుంది. ఇది ప్రభుత్వానికి హెచ్చరిక.. అధికార యంత్రాంగానికి బాధ్యత గుర్తుచేసే సందర్భం.. సమాజానికి నీటి విలువను తెలియజేసే సమయం. వర్షాల కోసం ఆకాశం వైపు ఆశగా చూసే రైతన్నకు భరోసా ఇవ్వాలి. బిందెడు నీటి కోసం ఎదురుచూసే ప్రజల దాహం తీర్చాలి. కరువు కాటుకు కుటుంబాలు కుదేలుకాకుండా చూడాలి. రేపటి పరిస్థితిని ఊహించి ఈరోజే చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే కరువు తీవ్రతను తగ్గించడానికి వాన కోసం వేచి చూడటమే మార్గం కాదు.. ముందుచూపుతో పనిచేయడమే అసలైన పరిష్కారం.

సామాజిక చైతన్యం..
రఘువర్మ కలం!

భారతీయ సాహిత్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్, తెలుగు సాహిత్యంలో అడవి బాపిరాజు, అలిశెట్టి ప్రభాకర్ వంటి పలువురు రచయితలు సాహిత్యంతోపాటు చిత్రకళలోనూ రాణించారు. అదే కోవకు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి డా. తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ. కవి, రచయిత, చిత్రకారుడు, అనువాదకుడు, పరిశోధకుడిగా ఆయన చేసిన కృషి విశేషమైనది.



లక్ష్మీనారాయణ 1956 మే 12న జగిత్యాలలో రాజేశ్వరి, లక్ష్మీరాజ్యం దంపతులకు జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు సాహిత్యంలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. అధ్యాపకుడిగా వివిధ విద్యాసంస్థల్లో పనిచేసి 2014లో పదవీ విరమణ పొందారు. తన తమ్ముడు రఘునాథ్‌లోని 'రఘు', చిత్రకారుడు రవివర్మలోని 'వర్మ' పదాలను కలిపి 'రఘువర్మ' అనే కలం పేరును ఎంచుకున్నారు. 1970 నుంచే కవిత్వ రచన ప్రారంభించిన ఆయన సాహిత్యంతోపాటు చిత్రకళలోనూ ప్రతిభ చాటారు. రఘువర్మ తొలి వచన కవితా సంపుటి 'హృదయ జలధి'లో 1979 నుంచి 2008 వరకు రాసిన 37 కవితలు ఉన్నాయి. ఈ సంపుటికి ముందుమాట రాసిన డా. సి. నారాయణరెడ్డి, ఆయన కవిత్వాన్ని ప్రశంసించారు. 'సైనిక సోదరా' కవితలో జవాన్ల ధైర్యసాహసాలను, దేశభక్తిని చాటగా, 'కుంభకోణం' కవితలో అవినీతిని ఎండగట్టారు. 'వేశ్య' కవితలో సమాజంలోని ద్వంద్వ వైఖరిని ప్రశ్నించారు. సామాజిక చైతన్యంతోపాటు భావకవిత్వ ప్రభావం కనిపించే రచనలు చేశారు. 'కవిత్వం', 'వింత భాష', 'మూడో కంటి చూపు', 'మేఘ రాగ రంజని' తదితర సంపుటాలను వెలువరించారు. అనువాద రంగంలోనూ రఘువర్మ తనదైన ముద్ర వేశారు. కాళిదాసు సంస్కృత మహాకావ్యం 'మేఘసందేశం'ను స్వేచ్ఛా వచన కవితా శైలిలో తెలుగులోకి అనువదించారు. మూలంలోని భావసౌందర్యాన్ని కాపాడుతూనే సరళమైన తెలుగు పదాలతో అనువాదాన్ని రమణీయంగా తీర్చిదిద్దారు. సంస్కృత సమాసాలను, అచ్చ తెలుగు పదబంధాలను సందర్భానుసారంగా ఉపయోగించి ప్రత్యేకత చాటారు. 'రుతుసంహారం', భర్తృహరి 'నీతిశతకం' వంటి సంస్కృత రచనలనూ తెలుగులోకి అనువదించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల రచన 'గీతాంజలి'ని కూడా రఘువర్మ వచన కవితా రూపంలో అనుసృజించారు. ఈ రచనలో మూలంలోని భావాలను యథాతథంగా అనువదించడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని తెలుగు కవిత్వ సౌందర్యంతో ఆవిష్కరించారు. ఆచార్య పులికొండ సుబ్బాచారి తన ముందుమాటలో ఈ అనువాదంలోని పాద నిర్మాణం, వాక్య నిర్మాణం ప్రత్యేకతను ప్రశంసించారు. 'గీతాంజలి'ని వచన కవితా కావ్యంగా తీర్చిదిద్దడం రఘువర్మ సృజనాత్మకతకు నిదర్శనం. తెలుగు, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో పాండిత్యం సంపాదించి, వివిధ సాహిత్య ప్రక్రియల్లో విశేష కృషి చేసిన నిరాడంబర సాహితీవేత్త డా. తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ అక్టోబర్ 6న తుదిశ్వాస విడిచారు. అనువాద రంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో సత్కరించింది. సృజన, అనుసృజన, చిత్రకళల్లో ప్రతిభ చాటిన రఘువర్మ మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు.



- ఎర్రోజు వేంకటేశ్వర్లు

అధ్యక్షుడు, తెలుగు శాఖ, టీజీఎస్‌డబ్ల్యూఆర్ డిగ్రీ కళాశాల - కరీంనగర్
ఫోన్ నంబర్: 9492557037



గుడ్డు మీద ఈకలు..
కాంగ్రెస్ తీరేంటో..!

ప్రజాస్వామ్యంలో రాజకీయాలు ప్రజల సమస్యల చుట్టూ తిరగాలి. ప్రజాప్రతినిధుల చర్చల్లో సామాన్యుల కష్టాలు ప్రతిధ్వనించాలి. పాలకపక్షమైనా, ప్రతిపక్షమైనా ప్రజల ప్రయోజనాలే పరమావధిగా ఉండాలి. కానీ ప్రస్తుత రాజకీయాల్లో ఈ మౌలిక సూత్రాలకు తిలోదకాలిస్తూ వ్యక్తిగత విమర్శలు, పరస్పర ఆరోపణలకే ప్రాధాన్యం ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది.

తెలంగాణలో ప్రజలు కరువు కష్టాలతో అల్లాడుతుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం ప్రతిపక్ష నేతల వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ రాజకీయ విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసం? భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ గడ్డం పెంచుకుంటున్నారని, జుట్టు మార్పిడి చేయించుకున్నారని విమర్శించడం వల్ల ప్రజలకు ఒరిగేదేమిటి? ఆయన గడ్డం పెంచుకున్నా, జుట్టు మార్పిడి చేయించుకున్నా అది ఆయన వ్యక్తిగత విషయం.



ప్రజా జీవితంలో ఉన్న నాయకుల విధానాలను, నిర్ణయాలను, పాలనను ప్రశ్నించే హక్కు ఎవరికైనా ఉంటుంది. కానీ వారి వ్యక్తిగత రూపురేఖలను రాజకీయ విమర్శలకు వస్తువుగా మార్చడం వల్ల ప్రజా సమస్యలకు పరిష్కారం లభించదు. కాంగ్రెస్ నాయకులు ప్రజల తరఫున నిలబడాల్సిన సమయంలో ఇలాంటి అంశాలకు ప్రాధాన్యమివ్వడం వారి రాజకీయ పరిణతిని ప్రశ్నించేలా ఉంది. రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఒక్కసారి ఆలోచించాలి. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత, పడిపోతున్న భూగర్భ జలమట్టాలు రైతులను, గ్రామీణ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంటల సాగుపై అనిశ్చితి నెలకొంటోంది. పశువులకు మేత, నీటి లభ్యత సమస్యగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పట్టణాల్లోనూ నీటి సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అధికార పార్టీ నాయకులు ఏం చేస్తున్నారు? ప్రజల దృష్టిని ఆకర్షించాల్సిన అంశాలపై కాకుండా, గుడ్డు మీద ఈకలు పీకినట్లు అప్రధాన విషయాలపై విమర్శలు చేయడమే రాజకీయమా? ప్రతిపక్షం తప్పు చేస్తే నిలదీయాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను ఆధారాలతో ప్రజల ముందుంచాలి. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించుకోవాల్సి వస్తే వాటి ఫలితాలను వివరించాలి. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలి. ఇదే సమయంలో ప్రతిపక్షం కూడా ప్రజల సమస్యలను లేవనెత్తితే వాటికి సమాధానం చెప్పాలి. కానీ వీటన్నింటినీ పక్కనపెట్టి ఒక నాయకుడు గడ్డం ఎందుకు పెంచుకున్నాడు? జుట్టు మార్పిడి ఎందుకు చేయించుకున్నాడు? వంటి ప్రశ్నలతో రాజకీయాన్ని వ్యక్తిగత స్థాయికి దిగజార్చడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. అధికారంలో ఉన్న పార్టీకి బాధ్యత మరింత ఎక్కువ. ఎందుకంటే ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేస్తాయి. వర్షాలు సరిగా కురవకపోతే ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఏమిటి? తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? రైతులకు అవసరమైన సహాయం ఎలా అందిస్తున్నారు? ఉపాధి అవకాశాలు తగ్గిన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు ఏం చేస్తున్నారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రజల దృష్టిని వ్యక్తిగత విమర్శల వైపు మళ్లించడం వల్ల ఈ ప్రశ్నలు మరుగున పడిపోవచ్చు. కానీ ప్రజల కష్టాలు మాత్రం తొలగిపోవు. రాజకీయ నాయకులు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజలు అన్నింటినీ గమనిస్తుంటారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలను, అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలను, కష్టకాలంలో తమకు అండగా నిలిచారా లేదా అన్న విషయాలను బేరీజు వేస్తుంటారు. సభల్లో చేసే ప్రసంగాలకంటే తమ జీవితాల్లో కనిపించే మార్పులకే ఎక్కువ విలువ ఇస్తారు. తాగునీరు అందిందా? పంటకు నీరు లభించిందా? రైతుకు గిట్టుబాటు ధర వచ్చిందా? పేదవాడికి సంక్షేమ పథకాలు అందాయా? నిరుద్యోగికి ఉద్యోగం దొరికిందా? ఇవే ప్రజల దృష్టిలో అసలైన రాజకీయ ప్రశ్నలు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలి. వ్యక్తిగత విమర్శలతో రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టాలనే ధోరణిని విడనాడాలి. ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలి. ప్రభుత్వ పనితీరును వివరించాలి. లోపాలుంటే సరిదిద్దుకోవాలి. ప్రతిపక్షంపై విమర్శలు చేయాల్సి వచ్చినా అవి ప్రజా విధానాలు, పాలన, ప్రజా ప్రయోజనాలకే పరిమితం కావాలి. అప్పుడు మాత్రమే రాజకీయ చర్చలకు విలువ ఉంటుంది. ప్రజల ఆకలి, దాహం, కరువు కష్టాల కంటే నాయకుల వ్యక్తిగత రూపురేఖలే ముఖ్యమని భావిస్తే ప్రజలు క్షమించరు. ప్రజల సమస్యలను విస్మరించి రాజకీయ ప్రత్యర్థుల వ్యక్తిగత విషయాల చుట్టూ తిరిగే నాయకులకు ఎన్నికలే తగిన గుణపాఠం చెబుతాయి. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా తీర్పు చెప్పే అవకాశం ఉంది. ఆ తీర్పు ఎలా ఉంటుందో ముందుగానే ఊహించుకుని అధికార పార్టీ నాయకులు అప్రమత్తం కావాలి. రాజకీయాలు వ్యక్తిగత దూషణల వేదికలు కావు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడే సాధనాలు. అధికారం శాశ్వతం కాదు. పదవులు శాశ్వతం కాదు. ప్రజల విశ్వాసమే రాజకీయ నాయకులకు నిజమైన బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే మాటల్లో కాకుండా చేతల్లో ప్రజలకు అండగా నిలవాలి. కరువు కష్టాలతో ప్రజలు అల్లాడుతున్న వేళ వారి గోడు వినకుండా వ్యక్తిగత విమర్శలతో కాలక్షేపం చేయడం ఏ పార్టీకి మంచిది కాదు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని ప్రజల పక్షాన నిలబడితేనే మంచిది. లేదంటే ప్రజల అసంతృప్తి ఎన్నికల వేళ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించే పరిస్థితిని తీసుకురావచ్చు.

- సత్యానంద్, హనుమకొండ

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం, మీ బైలైన్‌తో..!
పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.